19 . 2. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

గురువారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 255 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

**శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు

# గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం..

# నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ...

- అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన
- పట్టణాభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం
- ముంబయి క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి





**ముంబయి,ఫిబ్రవరి18 వెలుతురు:** గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తు న్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో





దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణ మైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు

## ఎఐ సమ్మిట్ కోసం భారత్‌కు సుందర్ పిచాయ్

- ప్రధాని మోడీతో భేటీ అయినట్లు వెల్లడి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 వెలుతురు:** సాంకేతిక ప్రపంచంలో భారత్ తన ముద్ర వేస్తోంది. ఇందులో భాగంగా.. గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బుధవారం న్యూఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ప్రధాని మోదీ-సుందర్ పిచాయ్ మధ్య జరిగిన ఈ సమావేశం ప్రధానంగా కృత్రిమ మేధ, డిజిటల్ మౌలిక సదుపాయాల చుట్టూ సాగినట్లు సమాచారం. భారత్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'ఇండియా ఎఐ ఇంపాక్ట్

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు



- ఆన్‌లైన్ ద్వారా నమోదు ప్రక్రియ ప్రారంభం
- స్పెషల్ కమిషనర్ ప్రియాంక వెల్లడి

# ధరణి దోపిడిపై ఉక్కుపాదం

- తీగలాగితే డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం,
- అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు
- కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు,
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:** తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించవలసిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత





స్థాయి కమిటీతో విచారణ జరిపించగా దిగ్భ్రాం÷-రతి కరమైన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీతో బుధవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి

# రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

- విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం
- యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల మరమ్మతులు
- సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల నిరంతర పరిశీలన
- లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం
- సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరం జరగాలి
- దేశంలోనే మోడల్‌గా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:** రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా,





## నగరంలో పారిశుద్ధ్యానికి

# పెద్దపీట

- పటిష్టంగా చెత్తసేకరణ పనులు
- ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు చర్యలు
- అధికారులతో సమీక్షించిన సివిఎస్ రామకృష్ణారావు

## రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు భవనాలు శాఖ కీలకం

- రోడ్డు నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి అవసరం
- 2026-27 వార్షిక బడ్జెట్ ప్రపోజల్స్ పై ఆరా
- అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష

### రీజినల్ రింగ్ రోడ్డు గేమ్ చేంజర్



**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:** రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు భవనాలు శాఖ ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నదని, స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బ్జడెట్ ఎస్టిమేట్స్ ఉండాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది బడ్జెట్... పనుల పురోగతి..విడుదలైన నిధులపై కూలంకషంగా మంత్రి చర్చించారు. రీజినల్ రింగ్ రోడ్డు లాంటి గేమ్ చేంజర్ ప్రాజెక్టులపై ప్రధాన దృష్టి సారించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 2047 రైసింగ్ తెలంగాణ నినాదంలో రాష్ట్ర రోడ్ నెట్వర్క్ అభివృద్ధి అత్యంత కీలకం కానుందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర రోడ్ నెట్వర్క్ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారు.. హ్యామ్ రోడ్ల నిర్మాణంతో రాష్ట్ర వ్యాప్తంగా అద్దం లాంటి రోడ్లు నిర్మించబోతున్నాం. ఇప్పటికే ఉన్న బాలారిష్టాలు దాటేందుకు

## 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో కీలకంగా లైఫ్ సైన్సెస్

- దేశ జీడీపీలో మన వాటాను 10 శాతానికి పెంచేందుకే
- తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం
- బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి శ్రీధర్ బాబు





## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

- నగరంలో అర్హుల జాబితా తయారీ,
- అసంపూర్తి 2 బిహెచ్‌కె ఇళ్ల పూర్తి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:** హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్ నందు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక , రెండు పడకల గదుల ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకతగా వ్యవహరిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందించటమే ప్రభుత్వ లక్ష్యమని

## ప్రారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్

- ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి
- 33 జిల్లాల నుండి 2,532 మంది క్రీడాకారుల భాగస్వామ్యం



**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్

# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

- ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించిన రాష్ట్రపతి
- ముర్ముతో పాటు పాల్గొన్న గవర్నర్, సిఎం, డిప్యూటీ సిఎం

**విశాఖపట్నం,ఫిబ్రవరి18 వెలుతురు:** దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్యంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఈ కార్యక్ర మంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఏపీ గవర్నర్



https://epaper.velthuru.com



వెలుతురు

## రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు భవనాలు శాఖ కీలకం

అన్ని రకాల ప్రయత్నాలు చేశాం..అధికారులు కూడా మనసుపెట్టి పనిచేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాపై కన్ఫ్యూజన్ లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలి.. హైదరాబాద్–విజయవాడ (ఎన్హెచ్ 65) 8లేన్ విస్తరణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని మరోసారి కోరతా.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు...ఇది పూర్తయితే హైదరాబాద్ నుండి విజయవాడ రెండున్నర గంటల్లో చేరుకోవచ్చు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేంద్ర సహకారం అందించే ప్రాజెక్టుల్లో వేగం పెంచాలని కేంద్ర మంత్రులను కలుస్తానని కోమటిరెడ్డి తెలిపారు.

## విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని.. ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు 9 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొనసాగుతోంది. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా వీక్షించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ప్రయాణించారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి.

## ప్రారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026’ సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ క్రీడా జ్యోతిని అందించగా, డీజీపీ దానిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ’జయ జయహే తెలంగాణ’ గీతాన్ని క్రీడాకారులు, అధికారులు కలిసి ఆలపించగా మైదానమంతా రాష్ట్ర స్ఫూర్తితో మారుమోగింది. పోలీస్ లాంఛనాల మధ్య డీజీపీ గన్ ఫైర్ చేసి, గాలిలోకి బెలూన్లు ఎగురవేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీజీపీ డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా కార్యక్రమానికి హాజరైన వారందరినీ అభినందించారు. ఇటీవల రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల బందోబస్తు మరియు సమ్మక్క–సారక్క జాతర వంటి కీలక బాధ్యతలను పోలీసులు అత్యంత నిబద్ధతతో నిర్వహించారని కొనియాడారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. పోలీసులు వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. క్రీడలు మనలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడం తో పాటు టీమ్ స్పిరిట్, ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పథకాలు సాధించడం కంటే కూడా మంచి స్నేహితులను సాధించడం గొప్ప అన్నారు. మహిళా పోలీసుల ప్రాతినిధ్యం ప్రతి విభాగంలోనూ పెరగాలని, ప్రతిభతో పాటు నాయకత్వ లక్షణాలను చాటుకోవాలని సూచించారు. గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తి, ఐక్యత మరియు పరస్పర గౌరవం ముఖ్యమని, ఇదే స్ఫూర్తిని వృత్తిలోనూ ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు

**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:**
రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జి ఓ ఎం ఎస్ నెం. 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీ ల్యాన్సర్ మరియు వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమాచార శాఖ ప్రత్యేక వెబ్ సైట్ ను రూపొందించామన్నారు. సమాచారశాఖ వెబ్ సైట్ లో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ నెల 9వ తేదీ నుండి దరఖాస్తు లను ఆ÷–లనైన్ లో తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్ దరఖాస్తు మరియు జారీ పక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదైన టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమైతే సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగంలో ఈ నెంబర్ 9154170881కు కార్యాలయం పని వేళలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలలో సంప్రదించవచ్చునని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

స్పష్టం చేశారు. ఎల్ వన్ కింద 4800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇల్లు నిర్మించుటకై నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అలాగే ఎల్ టు (ఒ2) కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వివిధ నియోజకవర్గాల నుండి పేద ప్రజలు అందజేశారని మంత్రి వివరించారు. హైదరాబాద్ మహానగరంలో స్థలాలు సేకరించి జీ ప్లస్ 5–10 వరకు ఇందిరమ్మ ఇల్లు చేపట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి వివరించారు.. పెండింగ్ లో ఉన్న 2 బిహెచ్‌కె ఇళ్ల పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు.ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి.. లబ్దిదారులు ఎంత మంది తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 2 బిహెచ్‌కె లబ్దిదారులకు అందించమని ఇంకా పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ,అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై శాసనసభ్యులతో కలిసి మంత్రులు సమీక్షించారు. తదుపరి హైదరాబాద్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల శాసనసభ్యుల అభిప్రాయాలను ఈ సందర్భంగా స్వీకరించి చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు క్రమశిక్షణను పెంచుతాయన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని జీసీఎం అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాసం సంతోషంగా జరుపుకొని, అల్లా దీవెనలు పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## నగరంలో పారిశుధ్యానికి పెద్దపీట

**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:**
గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు నగర పరిశుభ్రతపై ఇప్పటి వరకు తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సి.ఎస్ కు వివరించారు. సమావేశంలో పరిశుభ్రత, చెత్త సేకరణ విధానం, పరిశుభ్రతా చర్యలు, ప్రజా ఆరోగ్య పరిరక్షణపై తీసుకుంటున్న చర్యలను సి.ఎస్ సమగ్రంగా పరిశీలించారు. వివరాలన్నంటిని ఎప్పటికప్పుడు డాష్ బోర్డ్ లో పొందుపరచాలని సి.ఎస్ ఆదేశించారు. జి.హెచ్.యం.సి పరిధిలో 4500 స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్నాయని, 2650 స్వయం సహాయక బృందాల సభ్యులు మొత్తం 18 వేల 557 మంది శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నారని జి.హెచ్.యం.సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. నగర పరిధిలో రోజు వారిగా 7800 టన్నుల మేరకు గార్బేజ్ సేకరణ జరుగుతుందని అన్నారు. మున్సిపల్ విభాగం ప్రభుత్వంలో కీలకమని, ప్రజల అవసరాలకు తగినట్లుగా బాధ్యతలు నిర్వర్తించాలని, అధికారులు విధులలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని సి.ఎస్ అన్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉండేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. చెత్త సేకరణ (డ్రై, వెట్ వేస్ట్), ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సి.ఎస్ ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, సమయానుసారంగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రపరిచే చర్యలు ముందస్తుగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్లు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల బ్జడెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్ లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రీ బ్జడెట్ సమావేశాలు నిర్వహించారు. మంత్రి అజారుద్దీన్ తో కలిసి మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బ్జడెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబం లా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ కు బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకురావాలని వాటిని కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్ ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని కరెంటు భారం లేకుండా చేసుకోవడమే కాదు, సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని తెలిపారు. వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం కొత్త మెనూ అమల్లోకి తీసుకు వచ్చాం, వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం వి నేపథ్యంలో జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు వసతి గృహాలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలించాలని వీలైతే ఒక రోజు రాత్రి అక్కడే బస చేయాలని గతంలోనే ఆదేశించాం, ఆ పక్రియ ఎంత మేరకు కొనసాగుతుందో సెక్రటరీలు ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా పర్యవేక్షణ జరపాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాల అద్యలను క్లియర్ చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ బిల్డింగుల మరమ్మతు బిల్లులు ఉంటే వెంటనే పంపాలని వెనువెంటనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. వరి సాగు పెద్ద ఎత్తున చేయడం, బాయిల్డ్ రైస్ ను తమిళనాడు వంటి రాష్ట్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడం నేపథ్యంలో భవిష్యత్తులో రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలని నీటిపారుదల శాఖ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచించారు. వరి స్థానంలో పామ్ ఆయిల్, పప్పు ధాన్యాలు సాగు చేస్తూ, పంట నిలువల స్టోరీ ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలో పెంచాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వం బీసీ లకు బ్జడెట్ లో ప్రాధాన్యత కల్పిస్తుంది.. బీసీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రీన్ చానెల్ ద్వారా డైట్ / కాస్మొటిక్ ఛార్జీలు విద్యార్థులకు స్కాలర్ షిప్ లు విడుదల చేస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలు అ÷–దదెలు సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉంచేదని ప్రజా పాలన ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టల్ ప అ÷–దదెలు చెల్లిస్తుంది. ఈసారి బ్జడెట్ లో బీసీ లలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి వారి ఆర్థిక వృద్ధి సాధించడానికి ప్రత్యేక పథకాలు ప్రారంభించాలని కోరడం జరిగిందనీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహా లక్ష్మీ ద్వారా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా జరుగుతుంది. ప్రభుత్వం మహా లక్ష్మి నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుంది. మహా లక్ష్మి కి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో బస్సులు సంఖ్య కూడా గణనీయంగా పెంచడం జరుగుతుంది. త్వరలోనే ఆర్టీసీ లో ప్రయాణించే మహిళలకు మహా లక్ష్మి కార్డులను ప్రతి ఇంటింటా పండగల అందించడం జరుగుతుందనీ పోను ప్రభాకర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ కు వచ్చి ఆర్థికంగా, ఇతరత్రా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశంలో, రాష్ట్రంలో అత్యుత్తమ ఉపాధ్యాయులను గుర్తించి హైదరాబాద్ నుంచి ఆ÷–లనైన్లో పాఠాలు బోధిస్తారని ఇది దేశంలోనే ఒక మోడల్ గా మారబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్, కాచిగూడ కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న విలువైన స్థలాల్లో భారీ బవంతులు నిర్మించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు భవనాలు నిర్మించే ఆలోచనలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు మిస్ చార్జీలు, అ÷–దదెలు క్లియర్ చేయడం అభినందనీయమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, హాస్టల్లో మోడల్ కిచెన్లు ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలించాలని ఈ పక్రియను దశలవారీగా ప్రారంభించాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఊజీప, ఖీఖీఖీ, హైదరాబాద్– విజయవాడ, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు, రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు రహదారుల నిర్మాణం పనులు వివిధ దశలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ బ్జడెట్ సమావేశంలో సంతకం చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో, ప్రధానంగా హైదరాబాద్ కేంద్రంలో సంవత్సరం పొడుగునా కల్చరల్ యాక్టివిటీ కొనసాగేలా సినిమాటోగ్రఫీ శాఖలో ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సంక్షేమ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, రవాణా,రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, సివిల్ సప్లై శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంక్షేమ శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో కీలకంగా లైఫ్ సైన్సెస్

**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:**
తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్ లో ’బయో ఏషియా 2026’ సదస్సులో భాగంగా ’తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం’ పేరిట నిర్వహించిన ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో ’తెలంగాణ రైజింగ్ 2047’కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నా మన్నారు. అందులో భాగంగానే.... తెలంగాణ నెక్స్ట్ – జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యూబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. ఈ ఏడాది సదస్సులో సనోఫీ, ఒపెల్లా , వ్యాక్సిండో యానిమల్ హెల్త్, ట్రెడెన్స్, ఆర్ఎక్స్ ప్రొపె÷–లలెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు ముందుకొచ్చాయన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. ’బయో ఎకానమీ’ రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్ కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి... ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసారి ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులతో పాటు దేశ విదేశాల నుంచి మొత్తం 4,394 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల కోసం 4వేలకు పైగా అత్యున్నత స్థాయి బిజినెస్ టూ బిజినెస్ సమావేశాలకు ఈ ఏడాది సదస్సు వేదికగా నిలిచిందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

## ధరణి దోపిడిపై ఉక్కుపాదం



మాట్లాడుతూ.. ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగానే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చారని అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్ ను రూపొందించారని , భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండా లాగిన్‌లు డిలిట్ చేశారని, అత్యంత రహస్యంగా ఉండవలసిన లాగిన్ వివరాలు లేకుండా పోయాయని ఉన్నత స్థాయి కమిటీ విచారణలో ప్రాథమికంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లభించకుండా చేశారని ,ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదన్న విషయం బహిర్గతమైందని, ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్ పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణా బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి సూచనల మేరకు ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, తప్పుచేసినవారు ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రభుత్వానికి రావలసిన ప్రతిపైసాను వసూలు చేస్తామన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగకుండా ఏ చిన్న లోపానికి తావులేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా భూభారతి పోర్టల్ ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ , సిఎం ఆర్ వో మందా మకరంద్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ డిఐజి సుభాష్, ఎస్‌బి ఎస్పీ సింధు శర్మ, సైబర్‌క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, హోంశాఖ సలహాదారు పి. శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎఐ సమ్మిట్ కోసం భారత్‌కు సుందర్ పిచాయ్

సమ్మిట్–2026’లో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు చేరుకున్నారు. సుందర్ పిచాయ్ ఈ శిఖరాగ్ర సమావేశంలో 20న కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ’ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం భారత దేశానికి తిరిగి రావడం ఆనందంగా ఉంది. ఎప్పటిలాగే చాలా మంది మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నారు’ అంటూ రాసుకొచ్చారు. ఈ సదస్సులో 110కి పైగా దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి.

## దళితనాయకుడు బాల్క అరెస్ట దుర్మార్గం

**- కాంగ్రెస్ అక్రమాలను ఎదరించినందుకు అరెస్టా**

**- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు**

**హైదరాబాద్,ఫిబ్రవరి18 వెలుతురు:**
క్యాతనపల్లిలో కాంగ్రెస్ అప్రజాస్వామిక, అహంకార చర్యలను అడ్డుకున్నందుకు మాజీ శాసనసభ్యులు, దళిత నాయకుడు బాల్క సుమన్ ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. క్యాతన్ పల్లిలో బీఆర్ఎస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చినా కూడా కాంగ్రెస్ పార్టీ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరు చూసి యావత్ తెలంగాణ అసహ్యించుకుంటున్నదని అన్నారు. అధికార బలం, పోలీసు బలం, ధన బలంతో చట్టాలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ అరాచక వైఖరికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. రాష్ట్రమంతా కాంగ్రెస్ మార్కు గూండాగిరి రాజ్యమేలుతున్నది. మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ మురుగు రాజకీయాల వాసన కమ్ముకున్నది. హంగ్ వచ్చిన చోటల్లా ప్రతిపక్ష నాయకులను సంత భేరం చేస్తూ,



కిడ్నాపులకు తెగబడుతూ ప్రజా తీర్పులను కాలరాస్తున్న తీరును నిదర్శనాలు ఎన్నోనని అన్నారు. జనగామలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్‌కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని సమాజం కళ్లారా చూసిందని వెల్లడించారు. తమ కళ్ళెదుట ఒక దళిత మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు దాడికి తెగబడితే అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదని అన్నారు. ఒక్క క్యాతనపల్లే కాదు తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును గౌరవించకుండా చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ ను భేషరతుగా విడుదల చేయాలని, ప్రజాస్వామిక వాతావరణంలో క్యాతన్ పల్లి చైర్మన్ ఎన్నిక జరిగేలా బాధ్యత వహించాలని ఎన్నికల కమిషన్ ను డిమాండ్ చేశారు.

# పవన్ కాన్వాయ్‌కి ప్రమాదం



**అమరావతి వెలుతురు ఫిబ్రవరి 18:**
డ్యూపూటి సీఎం పవన్ కాన్వాన్కి ప్రమాదం జరిగింది. సిరిపురం నుంచి పెద్ద వాల్తేరు వెళ్తుండగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర కాన్వాయ్లని వాహనం సడన్ బ్రేక్ వేయడంతో.. చివరి వాహనం డ్యామేజ్ అయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాద సమయంలో పవన్ కాన్వాయ్లే లేరని, ఆయనను పికప్ చేసుకోవడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం..

# శభాష్ బండి

- కరీంనగర్ మేయర్ ను బీజేపీ కైవసం చేసుకోవడం అభినందనీయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ను అభినందించిన శివప్రకాశ్ జీ
- సంజయ్ ను సన్మానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, తరుణ్ చుగ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**
మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడమే కాకుండా కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంపట్ల బీజేపీ అగ్ర నాయకత్వం సంతోషం వ్యక్తం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీజేపీ తొలిసారి కార్పొరేషన్ మేయర్ పదవిని చేజిక్కించుకోవడం అభినందనీయమని పేర్కొంది. ఈరోజు హైదరాబాద్ శివారులో పండిట్ దీన్ దయాళ్ మహా ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పార్టీ సంస్థాగత వ్యవహారాల సంయుక్త ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్ జీ, అగ్ర నాయకులు తరుణ్ చుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, పార్టీ ఏపీ అధ్యక్షులు మాధవ్ 'శభాష్...బండి సంజయ్" అంటూ అభినందనలు తెలపడంతోపాటు సన్మానించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోనూ మంచి ఫలితాలు సాధించిన స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ కు సైతం పార్టీ నాయకత్వం అభినందనలు తెలిపింది.

## మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ జి. సంజీవ రెడ్డి పుట్టిన రోజు వేడుకలలో పాల్గొన్న కొప్పుల ప్రవీణ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**
మాజీ రాజ్యసభ సభ్యులు, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (INTUC) ఆల్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ జి. సంజీవ రెడ్డి గారి తొంభై ఆరవ జన్మదినం సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు INTUC ఇన్‌చార్జ్ కొప్పుల ప్రవీణ్ కుమార్ గారు వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంజీవ రెడ్డి గారిని శాలువాతో సత్కరించి, వారు దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా ఉండి సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్మిక సంఘ ప్రతినిధులు మరియు అభిమానులు కూడా ఈ సందర్భంగా తమ శుభాకాంక్షలు తెలియజేశారు

## రాజేంద్రనగర్ లక్ష్మిగూడలో చదరపు గజం రూ.51 వేలు

- హౌసింగ్ బోర్డు ఒపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన
- హాట్ కేకుల్లా అమ్ముడైన 14 ప్లాట్లు
- హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం

**హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు):**
రాజేంద్రనగర్ మండలంలోని లక్ష్మిగూడలోని హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన లభించింది. ఇక్కడి 14 ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించడానికి హౌసింగ్ బోర్డు ఈ నెల 2 వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా బుధవారం నాడు నిర్వహించిన వేలం పాటలో 49 మంది కొనుగోలుదారులు పాల్గొనగా ప్లాట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. ఈ భూముల చదరపు గజానికి రూ. 32 వేల ను కనీస ధరగా నిర్ధారించగా, వేలం పాటలో గరిష్టంగా చదరపు గజం రూ.51 వేలకు కొనుగోలు చేశారని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 14 ప్లాట్ల విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల మేర ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. హోసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించిన ఈ భూముల విక్రయాల్లో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలకగా, సగటున చదరపు గజం భూమి రూ. 44,285 ధర పలికింది.

# తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) 2026-సంవత్సర నూతన డైరీని ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్.



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**
తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) హైదరాబాద్ శాఖ, 2026-సంవత్సర నూతన డైరీని బుధవారం రోజున శాసనసభ భవనంలోని ఛాంబర్ లో ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్న టీజీవో హైదరాబాద్ శాఖ అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, సెక్రటరీ నిరంజన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు ఈ. శ్రీనివాస రావు, మరియు సభ్యులు..

# గ్రీన్ ఎనర్జితోనే విప్లవం.. నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ...

సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్యం÷-ర అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటి,ఐఐటెం,ఐఐఎస్‌సి వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు. కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్,ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు.




హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా ప్రకటించగా, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశిరచినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి చైనా ప్లస్ 1 కు ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8? లేదా దాదాపు 25? గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు. దేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.. ఓఆర్ఆర్, ట్రిప్ ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ÷ూతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి , వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా ఇవిల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోనే ఇవి తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# అట్రాసిటీ బాధితులకు ఇళ్ల పంపిణీ

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నేరాలపై మంత్రి అడ్లూరి..సమీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి18 ( వెలుతురు):**
ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు మంత్రి అడ్లూరి. లక్ష్మణ కుమార్ ఇళ్ల ను పంపిణ్న చేశారు. ఈ కార్యక్రమం మల్కాజ్గిరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక నేరాలపై సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులకు మంత్రి డబల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం బాధితులకు దళిత, బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరిగినప్పుడు, న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా వ్యవహరిస్తూ వారికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం బాసటగా నిలుస్తుందని మంత్రి శ్రీ లక్ష్మణ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ బాధితులకు తగు న్యాయం చేసేలా చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు.అనుకోకుండా దురదృష్టవశాత్తు కొన్ని సంఘటనలు జరిగినప్పుడు, బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని అన్నారు. కేవలం డబుల్ బెడ్ రూమ్ లతో కాకుండా సంక్షేమ శాఖ ద్వారా బాధితులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రుణాలతో పాటు ఇతర సహాయం, సబ్సిడీ పరంగా అందించేందుకు, జీవనోపాధి కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ లు చొరవ తీసుకోవాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు. కనుండి



బాధితులకు ఎలాంటి ఆలస్యం జరగకుండా టైం బౌండ్ ప్రోగ్రాం రూపొందించుకొని వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పక్కదారి పట్టకుండా బాధితులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అవమానం నష్టం జరిగిన బాధితులకు పిసిఆర్ పిఓఏ ఆక్ట్ చట్టం ప్రకారం న్యాయం చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు బాధితుల పక్షాన నిరంతరం వారికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని మంత్రి కొనియాడారు. ఎస్సీ ఎస్టీలపై ఎలాంటి దాడులు గాని ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడితే, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు ఆదేశించారు.అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించి వాస్తవంగా నష్టపోయిన వారికి వీలైనంత త్వరగా న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అడ్లూరి ఆదేశించారు. దళిత, గిరిజన వర్గాలు చదువు వల్ల గొప్పగా రాణించగలుగుతారని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లను నిర్మాణం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో బృహతర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని మంత్రి అన్నారు. మంచి భవిష్యత్తు ఇవ్వటం మూలానే ఈ వర్గాలు ఉన్నత స్థాయికి చేరుకుంటారని మంత్రి తెలిపారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసి, బ్జడెట్లో నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు.ఎస్సీ ఎస్టీ పిల్లలు గొప్పగా చదువుకుని రాణించగలరన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తీకరించారు. చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. ఎస్సీ ఎస్టీలకు ఎలాంటి నష్టం ఇబ్బంది కలిగిన తాను ఎల్లప్పుడూ అండగా మంత్రి భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా 194 మంది ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు 30 లక్షల విలువగల ఇళ్లను మంత్రి చేతుల మీదుగా బాధపెట్లకు అందజేయడం జరిగింది. ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, తెలంగాణ సాంస్కృతిక సారథి గుమ్మడి వెన్నెల, కమిషనర్ ఆఫ్ పోలీస్ మల్కాజ్గిరి అవినాష్ మహంతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ చౌదరి, ఉప్పల్ జోన్ డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్, మల్కాజ్గిరి జోన్ డిప్యూటీ కమిషనర్ సిహెచ్ శ్రీధర్, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, ఎస్జీవో బిట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## క్యాతన్‌పల్లిలో అసలు సమస్య

# బాల్క సుమనే


- తమపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం
- కోరం లేకనే ఛైర్మన్ ఎన్నిక వాయిదా
- మంత్రి వివేక్ వెంకటస్వామి వివరణ

**మంచిర్యాల,ఫిబ్రవరి18 వెలుతురు:**
బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ తీరుపై తెలంగాణ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమన్ తమపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. ఇదేం పద్ధతని.. ఈ విషయంలో బాల్క సుమన్‌ని హరీశ్‌రావు సమర్థిస్తారా అని ప్రశ్నించారు. బుధవారం క్యాతనపల్లిలో మీడియాతో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. క్యాతనప్లలెలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. సుమన్ దౌర్జన్యం అందరూ చూశారన్నారు. సుమన్ ఆరోపణలన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. ఆయన రెచ్చగొట్టి డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహించారు. మొదటిరోజు కోరం లేకపోవడంతో క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికని వాయిదా వేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రెండోరోజు బయటి వాళ్లు వచ్చి గొడవ చేశారని చెప్పుకొచ్చారు. అనవసర గొడవ కారణంగా రెండోరోజు వాయిదా పడిందని అన్నారు. ఎన్నిక ప్రాసెస్‌ను తాము అడ్డుకోలేదని స్పష్టం చేశారు. బాల్కసుమన్ తమ మీద రాళ్లు విసిరారని, దాడి చేశారని ఆరోపణలు చేశారు. రెండురోజులుగా సుమన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో చెన్నూరు, క్యాతనప్లలెలో సరిగా ఎన్నికలు జరగలేదని, గుండాయిజంతో మున్సిపల్ ఎన్నికలు ఏకగ్రీవం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అధికార దుర్వినియోగం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు క్యాంపు పెట్టుకుంటే ఎక్కడైనా తాము గొడవ చేశామా అని మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రశ్నల వర్షం కురిపించారు. తాము ఎలాంటి అధికార దుర్వినియోగం చేయలేదని తేల్చిచెప్పారు. మంత్రి, ఎంపీ కార్లపై రాళ్లు విసరడం సరైనదైనా అని నిలదీశారు. తమపై దాడిని ఖండిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా అధికారంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోయినా బాధలో బాల్కసుమన్ తమపై ఫ్రస్టేషన్ చూపుతున్నారని ్ర÷ర్ అయ్యారు. హరీశ్‌రావుకు ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే సుమన్ తమపై చేసిన దాడిని ఖండించాలని అన్నారు. తాము చెన్నూరులో ఏరోజు బీఆర్ఎస్‌పై దాడి చేయలేదని... ఎవరినీ అరెస్ట్ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

## సంపాదకీయం..

# గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి !

గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుధ్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయితీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి. మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తిపలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక



బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణ్ణాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి. అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడంలేదు. ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందలవేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగు తున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శు భ్రపరిచే స్వీపింగ్ మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది. ఓపెన్ డ్రెయినేజీల కారణంగా అనేక పట్టణాల్లోని వార్డుల్లో దుర్గంధం వ్యాపిస్తున్నది. నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు సరైన నిర్వహణలేక తరచూ లీకేజీలు అవుతున్నాయి. వార్డుల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేదు. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ జాడనే లేదు. ఈ సమస్యలన్నీ ఇప్పటికిప్పుడు వచ్చినవి కావు. ఏళ్లుగా రాజ్యమేలుతున్నాయి. సరైన పద్దతిలో పరిష్కారం చేయలేదు. వీటిని పరిశీలించి పరిష్కరించడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి మేలైన పాలనకు బాటలు వేయాలి.

## దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ మిలాఖత్

- తరచూ వారితో సమావేశం అవుతున్నారు
- విదేశీ పర్యటనల్లో ఇదే జరుగుతోంది
- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18( వెలుతురు):**
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత , లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ పై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్‌గాంధీకి భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. విదేశీ పర్యటనల సమయంలో విపక్షనేత వేర్పాటువాదులు, మావోయిస్టులు, అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు జార్జిసోరస్ లాంటి వ్యక్తులతో సమావేశమవు తున్నారని అన్నారు. దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపే ఆయన జాతీయ భద్రతకు చాలా ప్రమాదక రమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షాలు సిద్ధమవడంపై కూడా రిజిజు మాట్లాడారు. ప్రతిపక్షాలపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రాహుల్‌గాంధీ వారి వ్యాఖ్యలతో చర్చలకు అంతరాయం కలిగిస్తారని అన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ ఆయనలాంటి ప్రతిపక్ష నేతను చూడలేదని రిజిజు విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలు జరగనీయకూడదనే ఉద్దేశంతో కాగితాలు విసిరేయడం, నినాదాలు చేస్తూ వాకౌట్ చేయడం వంటి చిన్న పిల్లల చర్యలు చేస్తుంటారని అసహనం వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీ ఇలా సభకు అంతరాయం కలిగించడంవల్ల ప్రజల సమస్యల గురించి మాట్లాడాలనుకునే వారికి అవకాశం దక్కట్లేదని చెప్పారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని, జాతీయ ప్రయోజనాలతో రాజీ పడుతోందని ఇటీవల లోక్‌సభలో రాహుల్ ఆరోపించారు. అయితే రాహుల్ తన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని బీజేపీ పార్లమెంట్ సభ్యుడు నిషికాంత్ దూబే విమర్శించారు. ఫిబ్రవరి 12న లోక్‌సభలో రాహుల్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరారు. ఈ నేపథ్యంలో రాహుల్‌పై కిరణ్ రిజిజు తాజా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## యూట్యూబ్ వీడియో ప్లాట్‌ఫామ్‌లో సాంకేతిక సమస్య

- పలుదేశాల్లో వీడియో ప్లేకు అంతరాయం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18( వెలుతురు):**
ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో అంతరాయం నెలకొంది. మంగళవారం రాత్రి నుంచి ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. మొబైల్, కంప్యూటర్లలో యూట్యూబ్ ఓపెన్ చేస్తుంటే ఎర్రర్ అని చూపిస్తోంది. కొంతమందికి యూట్యూబ్ వీడియోలు లోడ్ కావడం లేదు. దీంతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అమెరికాలోనే మూడు లక్షలకు పైగా యూజర్లు డౌన్ డిటెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవుట్‌టేజ్ ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. ఈ సమస్య మంగళవారం రాత్రి 8 గంటలకు అమెరికాలో మొదలైంది. తమ వెబ్‌సైట్‌కు అమెరికాలో 3,20,000 కంటే ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు. ఇండియా నుంచి కూడా 18 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వీడియోలు ప్లే కావడం లేదని, సెర్చ్ రిజల్ట్ కనిపించడం లేదని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. యూట్యూబ్ సాంకేతిక సమస్యలపై ఆ సంస్థ యాజమాన్యం స్పందించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. సమస్కయ పరిష్కారం కోసం పనిచేస్తున్నామని పేర్కొంది.

## దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

- తెలంగాణలో కేఆర్ సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీల స్థానాలు ఖాళీ
- మార్చి 16న ఎన్నికల నిర్వహణకు ఇసి రంగం సిద్ధం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18( వెలుతురు):**
దేశవ్యాప్తంగా 37 రాజ్యసభస్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఖాళీ కాబోతున్న రాజ్యసభ సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం పది రాష్ట్రాల్లో సుమారు 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నది. ఈ మేరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలను విడుదల చేసింది.తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఏప్రిల్ 9వ తేదీన ఆ ఇద్దరి పదవీకాలం ముగియనున్నది. ఇక మహారాష్ట్ర నుంచి అత్యధికంగా ఏడు మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీకాలాన్ని ఏప్రిల్ 2వ తేదీన పూర్తి చేసుకోనున్నారు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన ఆ ఏడు స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒడిశాలో నలుగురు , తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, అస్సాంలో ముగ్గురు , బీహార్‌లో అయిదుగురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరి సీటు కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది రాజ్యసభ సభ్యులు ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారని, వారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌కు చెందిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 26వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకోవచ్చు. 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది.

## యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం

**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి18( వెలుతురు):**
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మూలవర్యుల అనుమతితో నిజాభిషేకం, విశ్వక్సేనారాధన, జలపూజ, పుట్టమట్టిలో నవధాన్యాలు నాటడంతోపాటు స్వస్తివాచనం వంటి వైదృశ్య కార్యక్రమాలతో బుధవారం బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు స్వస్తివాచన ఘట్టాన్ని ప్రారంభించారు. సకల దేవకోటిని ఉత్సవాలకు విచ్చేసి సర్వలోకాలకు క్షేమాన్ని కలిగించమని వేడుకునే కార్యక్రమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం జరిపారు. తొలి పూజల్లో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఆనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం 18 న స్వస్తి వాచనం, విష్వక్సేన ఆరాధన, సాయంత్రం మత్స్యగ్రహణం, అంకురార్పణ ఉంటుంది. 19న ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం భేరి పూజ చేపడతారు. ఫిబ్రవరి 20 న ఉదయం మత్స్యావతార అలంకారం,



సాయంత్రం శేష వాహన సేవ వేదపారాయణములు. రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 21 న ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంసవాహన సేవ,22 న శ్రీ కృష్ణాలంకార సేవ, రాత్రి పొన్న వాహనసేవ చేపడతారు.ం23 న ఉదయం గోవర్ధన గిరి ధారి, సాయంత్రం సింహ వాహన సేవ ఉంటుంది. 24న జగన్మోహినీ అలంకార సేవ, అశ్వ వాహనం పై రాత్రి ఎదుర్కోలు వేడుక చేస్తారు. 25న రాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, 26న రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం,27 న స్వామి వారి చక్రతీర్థ స్నానం. ఫిబ్రవరి 28 న గర్భాలయంలోని మూలవరులకు నిర్వహించే సహస్ర ఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నారు.

## కొలంబోకు సొంత దుడ్లతోనే వెళ్లా

- వైకాపా ఆరోపణలను తిప్పికొట్టిన లోకేశ్



**అమరావతి,ఫిబ్రవరి18( వెలుతురు):**
ఇటీవల కొలంబోలో జరిగిన భారత్-పాక్ మ్యాచ్‌కు తన సొంత ఖర్చుతో వెళ్లానని ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ధనం ఖర్చు చేసి వెళ్లినట్లు వైకాపా సొంత మీడియాలో జరిగిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. తనకు అంతటి దుస్థితి పట్టలేదన్నారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగతమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్? అని లోకేశ్ తనదైన శైలిలో పేర్కొన్నారు. శాసన మండలిలో వైకాపా పక్ష నేత బొత్స సత్యనారాయణ ఆ పార్టీ సభ్యులపై పట్టు కోల్పోయారని నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు పరస్పర విరుద్ధంగా రెండు వాయిదా తీర్మానాలు ఇచ్చారని చెప్పారు. ఒకరు కల్తీ లడ్డూపై.. మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చ కోరుతున్నారన్నారు. వారి కొట్లాటలో ఎవరు పైచేయి సాధిస్తారోనని తమకు ఆసక్తిగా ఉందని చెప్పారు. సభలో తమ స్ట్రాటజీ ఏంటో చూస్తారుగా అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## వేగంగా అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- ప్రమాదంలో మెదక్ వ్యాపారి మృతి



**మెదక్,ఫిబ్రవరి18( వెలుతురు):**
మెదక్ జిల్లా కొల్చారం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడిని మెదక్ పట్టణానికి చెందిన వీవీ సిల్క్స్ బట్టల షాపు యజమాని వనపర్తి రోహిత్ గుప్తా (50) గా గుర్తించారు. క్షతగాత్రుడిని ఎల్లారెడ్డికి చెందిన విజయ్‌గా గుర్తించారు. వీరు విజయవాడకు వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. యాక్సిడెంట్ గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## ముస్లిం మైనారిటీలకు ఆర్థిక సహాయం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ వి పట్నం మహేందర్ రెడ్డి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు అని ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ మైనారిటీ లో అభ్యున్నతికి కృషి చేస్తుండగా మేం అండగా నిలుస్తున్నాం అని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు అందిస్తున్న ఆర్థిక సహాయం లో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో మైనారిటీ లకు ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ కాగా నేడు ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన కింద 232 మంది టార్గెట్గా నిర్ణయించుకున్నాం. ప్రస్తుతం ఎంపిక చేసిన 225 మందిలో 5 మందికి కోటి కోటీ 12 లక్షల 50 వేల చెక్కును పంపిణీ చేస్తున్నాం. ప్రతి నిరుపేద మహిళలకు రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తున్నాం . రేవంత్ అన్న భరోసా పథకం కింద మైనారిటీలకు బైకుల పంపిణీ మేడ్చల్ జిల్లాలో 25 మందికి వాహనాల పంపిణీ చేస్తున్నాం. ప్రతి వాహనం రూ. లక్ష విలువ గలిదై ఉండగా 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా ప్రస్తుతం 13 మందికి వాహనాలు అందిస్తున్నాము. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సలహాదారు షబ్బీర్ అలీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కోత్వాల్ , గురుకుల పాఠశాల చైర్మన్ ఫయిమ్,ఎంఎల్సీలు ఇంఫెండీ, మీర్జా రహమత్ బేగ్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సెక్రటరీ షఫీఉల్లా, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతమైన అభివృద్ధి పనులు..!

**- పనులను పరిశీలించిన రజితాపరమేశ్వర్ రెడ్డి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి/ఉప్పల్ (వెలుతురు న్యూస్):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని చర్చి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. కాలనీలో కలుషిత మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.కోటి 9 లక్షలతో వాటర్ పైప్ లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. పైపు లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి వెంటనే రూ.కోటి 18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్టుగా తెలిపారు. చర్చి కాలనీలో వాటర్ లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను రూ. 2.27 కోట్లతో చేపట్టినట్టుగా చెప్పారు. అతి త్వరలోనే ఈ పనులను పూర్తి చేయనున్నట్లు గా తెలిపారు. కార్యక్రమంలో హెచ్ ఎమ్ డబ్ల్యూ ఎస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్ రెడ్డి,చర్చి కాలనీ అధ్యక్షులు జానీ, సుధాకర్, లుకాస్, రత్న రెడ్డి, డేవిడ్, ప్రవీణ్, సతీష్, సునీల్, రోసి మేరి, కార్తీక్, పుష్పాలమ్మ, ఫ్రాన్సిస్, బాలస్వామి, సల్ల ప్రభాకర్ రెడ్డి,సందీప్,భాస్కర్, రాఘవేంద్ర, వల్లపు శ్రీకాంత్ యాదవ్, సాగ శ్రీధర్, సత్తిరెడ్డి, పాల్గొన్నారు.

## చింతపల్లిగూడ గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి

**- డాక్టర్ ఉక్కుల అశోక్**



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 18:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చింతపల్లిగూడలో గత నెల రోజులుగా గ్రామంలో చెత్త చెదారం పేరు కుపోయిపరిశుభ్రత లేకుండా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటిచర్యలు తీసుకోకపోవడం దురదృ ష్టకరమని డాక్టర్ ఉక్కులఅశోక్ విమర్శించారు శంషాబాద్ జోనల్ ఆదిభట్ల సర్కి ల్ పరిధిలోని 54వ కొంగరకాలన్ డివిజన్లోఉన్న చింతపల్లిగూడ గ్రామాన్ని గ్రామస్తులతో కలిసి అ శోక్ పరిశీలించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోగత ఒక నెలరోజులుగా సరై నతాగునీటి సౌకర్యంలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అలాగే వీధిదీపాలుకూడా పని చేయకపోవడంతో రాత్రి సమయంలో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు అండర్ డ్రైనేజీ పనులకు నిధులుమంజూరు అయ్యి రెండునెలలు గడిచినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపో వడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శ నమని అన్నారు చిన్న గ్రామానికే కనీస వసతులు కల్పించలేని అధికారులు సర్కిల్ మొత్తాన్నిఎలా అభివృద్ధి చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తు న్నారు వెంటనే డ్రైనేజీ పనులు ప్రా రంభించి చెత్త తొలగించి తాగునీటి మరియు వీధిదీపాలసమస్యలను పరిష్కరించాలని డాక్టర్ ఉక్కుల అశోక్ సంబంధిత అధికారులనుకోరా రుసమస్యలపై స్పందించని అధికారులు డీఈ భిక్షపతివర్క్ ఇన్స్పెక్టర్ జాన్ సన్ లకుఎన్నోసార్లు ఫిర్యాదు చేసినాపట్టించు కోవడం లేదు కావున అధికారులుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈసమస్యలను పరిష్కరించే దిశగాచర్యలుతీసుకోవాలనిఅధికారులను కోరారుఈకా ర్యక్రమం లోఇందిరమ్మకమిటీ సభ్యులుజోగుశేఖర్ గ్రామశాఖఅధ్యక్షులు జోగునర్సింహ సీనియర్ నాయ కులుశేరిరమేష్ ఉడతల రవిగౌడ్ కొంపల్లిపాపిరెడ్డి జోగు జంగయ్యతదితరులుపాల్గొన్నారు

## గవర్నర్ చేతుల మీదుగా 'విశిష్ట ప్రతిభా రత్న' అవార్డు అందుకున్న సెరినిటీ విద్యార్థులు



**నాగారం, ఫిబ్రవరి 18 వెలుతురు:** రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించి నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు హరిక, ఆరాధ్య ప్రతిభా పతాకాన్ని ఎగురవేశారు. హిందీ సేవా సదన్ మహావిద్యాలయ్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో అగ్రస్థానం దక్కించుకుని 'విశిష్ట ప్రతిభా రత్న' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డును జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా స్వీకరించడం విద్యార్థులకు ప్రత్యేక గౌరవంగా నిలిచింది. విజేతలకు రూ. 2,500 నగదు బహుమతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులను అభినందించారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలను కొనసాగిస్తూ పాఠశాల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

# పిల్లలు జాతీయ సంపద.. జెన్ఆల్ఫా తరం ఇది..

**- వారికి మూస పద్ధతులు సరిపోవు**

**- సరికొత్త విద్యా ప్రణాళికలు కావాలి**

**- బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్ వ్యవస్థాపకుడు శ్రీ తిలక్ స్పష్టీకరణ**





**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:** భారతదేశం మళ్ళీ పూర్వ వైభవం సాధించి, సర్వశక్తి సంపన్నం కావాలంటే ఆ మార్పు మన పిల్లల పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య నుండే మొదలవ్వాలని బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్ వ్యవస్థాపక డైరెక్టర్ శ్రీ తిలక్ చెప్పారు. మన పిల్లలు, విద్యార్థులు జాతీయ సంపద అని స్పష్టం చేశారు. ఇటీవల బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ తిలక్ గారు మాట్లాడుతూ" 2014 నుంచి 2025 వరకు మధ్య జన్మించిన పిల్లలను 'జెన్ ఆల్ఫా' (Gen Alpha) గా వర్గీకరిస్తారు. మునపటి తరంతో పోల్చుకుంటే వీరి ఆలోచన తీరు భిన్నం. చాలా వేగంగా ఆలోచిస్తారు. వారి పరిశీలన శక్తి అద్భుతం. వీరికి అనుగుణంగా కరిక్యులం ను రూపొందించుకోవాల్సిందే. పుస్తకాల్లో ఉన్న విషయాన్ని యధాతథంగా వాళ్ళకి చెప్తే సరిపోదు. అందుకే మా విద్యా ప్రణాళికను వారికి అనుగుణంగా రూపొందించాము." అని చెప్పారు.

### ఒత్తిడి లేని అభ్యాసం.. సహజమైన ఎదుగుదల

" ప్రీ-నర్సరీ నుండి గ్రేడ్-2 వరకు ఎంతో కీలక దశ. ఈ కాలంలోనే బలమైన పునాది పడాలి. వారిపై ఎటువంటి బలవంతపు రుద్దుడు (Forceful Influence) లేకుండా జాగ్రత్త వహించాలి. పిల్లల ప్రపంచం వేరు. వారు తమదైన దృష్టితో ప్రపంచాన్ని చూస్తారు. అన్ లెర్నింగ్ అనేది అప్పటికి ఇంకా వారిలో మొదలు కాదు. పెద్దల ప్రపంచం వేరు. అన్ లెర్నింగ్ అనేది పెద్దలకు అలవాటైపోయి ఉంటుంది. లెర్నింగ్, అన్ లెర్నింగ్ మధ్య చక్కటి సమతుల్యతను సాధిస్తూ పిల్లలకు ఈ ప్రపంచాన్ని పరిచయం చేయాల్సి ఉంటుంది. అది బలవంతంగా ఉండకూడదు. వారంతట వారే, సహజంగానే ఈ మార్పును ఆహ్వానించుకునేలా, క్రమంగా పెద్దల ప్రపంచంలోకి, వాస్తవ ప్రపంచంలోకి వచ్చేలా చేయాల్సి ఉంటుంది. అప్పుడే వారిలోని సృజనాత్మక శక్తి తగ్గకుండా ఉంటుంది. వారి ఊహల ప్రపంచం నుండి వాస్తవ ప్రపంచంలోకి చాలా సున్నితంగా వారిని నడిపిస్తాం. అందుకే మా సంస్థకు BEST (Bharat Education Standard) అని పేరు పెట్టాం. ఇది కేవలం ఒక స్కూల్ కాదు, రేపటి పౌరులను తీర్చిదిద్దే ఒక సామాజిక బాధ్యత," అని చెప్పారు.

### ఊహల ప్రపంచానికి, వాస్తవానికి వారధి

పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రశాంతి గారు మాట్లాడుతూ.. " మన పాఠ్య ప్రణాళికలు ఒక స్ట్రక్చర్ బ్లూప్రింట్ కు పరిమితమైపోతున్నాయి. కానీ, నేటి పిల్లల అపరిమితమైన ఊహాశక్తికి ఆ పాత పద్ధతులు సరిపోవు. అందుకే పిల్లల ఊహల ప్రపంచానికి (World of Imagination) , పరిణతి చెందిన జ్ఞానానికి (World of Wisdom) మధ్య ఒక బలమైన వారధిని నిర్మించడమే మా లక్ష్యం. ఇక్కడ పిల్లల్లో ఉండే సహజమైన ఉత్సాహాన్ని (Natural Spark) ఏమాత్రం తగ్గించకుండా, లోకపు తర్కాన్ని (Logic) వారికి పరిచయం చేస్తాం. మా వద్ద పిల్లలకు కేవలం నేర్చుకునే స్వేచ్ఛ (Freedom to Learn) కాదు, అనవసరమైన విషయాలను వదిలివేసే చొరవ (Agility to Unlearn), నాయకత్వం వహించే ధైర్యం కూడా లభిస్తాయి," అని పేర్కొన్నారు. ఈ వినూత్న పాఠ్యప్రణాళికను అమలు చేయడానికి ప్రముఖ ఎడ్-టెక్ సంస్థ బ్రివోక్స్ ( BrivoI) తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు యాజమాన్యం తెలిపింది.

నూతన తరం సిలబస్ డిజైన్ ద్వారా విద్యా రంగంలో గుణాత్మక మార్పు తీసుకురావడమే ఈ ఒప్పందం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం. బ్రివోక్స్ సీఈవో , రామప్రియాంక ఈడ్పుగంటి మాట్లాడుతూ బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్తో కలిసి ప్రయాణించటం సంతోషంగా ఉందన్నారు. మన దేశ పిల్లల భవిష్యత్తుకు సంబంధించి బెస్ట్ స్టార్ట్ ఫౌండేషన్ స్కూల్ డైరెక్టర్ శ్రీ తిలక్ గారికి అద్భుతమైన విజన్ ఉందన్నారు. "మనం మన పిల్లలకి ఇచ్చే 'Best Start' అంటే కేవలం మంచి మార్కులు మాత్రమే కాదు. అసలైన విద్య అంటే వారిలో ఆత్మపరిశీలన (Self reflection), తట్టుకునే శక్తి (Resilience), మారుతున్న కాలానికి అనుగుణంగా మారే గుణాన్ని (Adaptability) పెంపొందించడం. పిల్లలకి వాళ్ల ఆలోచనలను కథల రూపంలో చెప్పే అవకాశం ఇస్తే, వారిలో అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (World Economic Forum) సభ్యురాలిగా మరియు 'ఉమెన్ ఇన్ టెక్' అంబాసిడర్గా, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ,భారతీయ విలువలకు అనుగుణంగానే మన పిల్లలను రేపటి నాయకులుగా తీర్చిదిద్దడమే బ్రివోక్స్, బెస్ట్ స్టార్ట్ ఆశయం." అని చెప్పారు.

# అక్రమ కట్టడాల 'అడ్డా'గా ఆల్విన్ కాలనీ, కూకట్ పల్లి సర్కిల్...

**- ఏసీపీ నుండి చైన్‌మెన్ వరకు 'ముడుపుల' జాతర!..**

**- వార్తలు వస్తున్నా చలించని అధికారులు - ముడుపుల మత్తులో 'టౌన్ ప్లానింగ్' విభాగం!**

**- సర్కిల్ 51, 52 లలో నిబంధనల ఉల్లంఘన.. అధికారుల కనుసన్నల్లోనే 'గగనతలానికి' స్లాబులు..!**

**- హైడ్రా బుల్డోజర్లు వస్తేనే కానీ ఈ అధికారుల మొద్దునిద్ర వదలరా..?**


















**కూకట్ పల్లి ఫిబ్రవరి 18 వెలుతురు :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆల్విన్ కాలనీ సర్కిల్ (51), కూకట్ పల్లి సర్కిల్ (52) టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమార్కులకు రక్షణ కవచంలా మారారు. జంట సర్కిళ్లలో సాగుతున్న అక్రమ నిర్మాణాల భాగోతం పై మీడియా కోడై కూస్తున్నా.. అధికారులలో చలనం లేకపోవడం గమనార్హం. అధికారులు కేవలం 'వసూళ్ల' పర్వంలో బిజీగా ఉన్నారని, అందుకే అక్రమ కట్టడాల వైపు కన్నెత్తి చూడటం లేదని స్పష్టమవుతోంది.

### ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 లో 'నిబంధనల' బలి!

సర్కిల్ 51 పరిధిలోని ఆల్విన్ కాలనీ 1, 2వ ఫేజ్, తులసి నగర్, సాయి నగర్, రామారావు నగర్, బాలకృష్ణ నగర్, పాపారాయుడు నగర్ కాలనీల్లో సెట్ బ్యాక్ లేకుండా, అనుమతి పొందిన అంతస్తుల కంటే అధికంగా స్లాబులు వేస్తూ యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నా.. టౌన్ ప్లానింగ్ విభాగం మౌనం వహించడం వెనుక భారీ 'మర్మం' దాగి ఉంది. క్షేత్రస్థాయిలో ఏసీపీ నుండి చైన్ మెన్ వరకు అందరికీ ముడుపులు అందుతున్నాయని, అందుకే ఈ అక్రమ కట్టడాలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

### కూకట్ పల్లి సర్కిల్ 52 లో నిబంధనలకు విరుద్ధంగా అంతస్తులకు అంతస్తులు..

వెంకట్రావు నగర్‌లో 'కమర్షియల్' అరాచకం! కూకట్ పల్లి సర్కిల్ 52 పరిధిలోని వెంకట్రావు నగర్‌లో ఒక కమర్షియల్ భవనం నిబంధనలకు పూర్తి విరుద్ధంగా వెలుస్తోంది. అధికారులకు ముడుపులు అందితే చాలు.. నిబంధనలు గాలికి ఎగరాల్సిందే అన్నట్లుగా ఇక్కడ పరిస్థితి తయారైంది. బి.సి (బిల్డింగ్ కలెక్టర్) లు వార్డుల్లో తిరుగుతున్నా, వారి దృష్టి కేవలం 'మామూళ్ల' పైనే ఉందని సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్ పల్లి, కెపిహెచ్బి కాలనీ, వసంత నగర్, సి బి సి ఐ డి కాలనీ, గోపాల్ రావు నగర్, భగత్ సింగ్ నగర్ కాలనీ లతోపాటు బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని 1, 2, 3, 4, 5 రోడ్ నెంబర్ లలో ఆరు ఏడు అంతస్తుల మేర అందులో ఎలాంటి కనీస సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదకర స్థాయిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. సామాన్యుడు చిన్నగా సెట్‌బ్యాక్ ఉల్లంఘన జరిపితే చర్యలు తీసుకునే అధికారులు.. బడా నిర్మాణదారుల జోలికి మాత్రం వెళ్లడం లేదు.

### సి బి సి ఐ డి కాలనీలో అక్రమంగా షెడ్ల నిర్మాణం...



కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని సి బి సి ఐ డి కాలనీలో అక్రమ షెడ్ల నిర్మాణాలు అదుపు తప్పుతూ రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండా యదేచ్చగా నిర్మాణాలు కొనసాగుతుండడంతో జిహెచ్ఎంసి ఖజానాకు కోట్ల రూపాయల ఆదాయం దూరం అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల పెరుగుదలపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అసలు స్పందన చూపకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. అక్రమాలను అడ్డుకునే అధికారులే చర్యలు తీసుకోకపోవడంతో అంటి ముట్టని అధికారుల నిర్లక్ష్యం వల్లే పరిస్థితి ఇంత దారుణంగా మారిందని కాలనీవాసులు విమర్శిస్తున్నారు.

### నోటీసులు ఇద్దాం.. దండుకుందాం!..

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు కేవలం కంటితుడుపు చర్యగా నోటీసులు ఇస్తున్నారు. కానీ, ఆశ్చర్యకరంగా నోటీసులు ఇచ్చిన భవనాల్లోనే పనులు మరింత వేగంగా పూర్తి అవుతున్నాయంటే టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమ నిర్మాణాల దారుల నుండి ఏ మేర దండుకుంటున్నారో ఇట్టే అర్థమవుతుంది. అధికారుల ఈ 'నోటీసుల నాటకం' అక్రమార్కులకు రక్షణగా మారుతోంది.



### హైడ్రా రంగంలోకి రావాల్సిందే!

ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల గండి కొడుతూ, నిబంధనలను బూటు కాళ్లతో తొక్కుతున్న సర్కిల్ 51, 52 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తక్షణమే దృష్టి సారించాలి. జంట సర్కిళ్లల్లో వెలుస్తున్న అక్రమ భవనాలను తక్షణమే సీజ్ చేయాలి. అవినీతి అధికారుల ఆస్తులపై విజిలెన్స్ విచారణ జరిపించి, వారిని వెంటనే విధుల్లో నుండి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





## బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యువనేత మట్ట ధనుంజయ్ గౌడ్





**భువనగిరి , ఫిబ్రవరి 18 (వెలుతురు ):**

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా యువజన నాయకులు మట్ట ధనుంజయ్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి, ఆయురారోగ్యాలతో పాటు దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మట్ట ధనుంజయ్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ చేసిన కృషి చారిత్రాత్మకమని కొనియాడారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, యువజన శ్రేణులు పాల్గొని కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

# బీసీల చైతన్యానికి గుర్తింపు

**- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారికి కృతజ్ఞతలు**

**- జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి**

**భువనగిరి, ఫిబ్రవరి 18(వెలుతురు):**





రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు గెలుపు పతాకం ఎగురవేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బీసీ సంఘాల ఉద్యమ స్ఫూర్తితో అధిక సంఖ్యలో కౌన్సిలర్లుగా విజయం సాధించడం బీసీల సామూహిక చైతన్యానికి నిదర్శనమని బీసీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొత్త నరసింహస్వామి మాట్లాడుతూ, "రాష్ట్రంలో అత్యధిక శాతం బీసీలు కౌన్సిలర్లుగా గెలవడం సాధారణ విషయం కాదని బీసీల శక్తిని అధిష్టానం గుర్తించి రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో చైర్మన్ పదవులను బీసీలకు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని వ్యాఖ్యానించారు. భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి, పోచంపల్లి మున్సిపాలిటీల చైర్మన్ పదవులను బీసీలకు కేటాయించడం శుభపరిణామమని, ఇది సామాజిక న్యాయానికి బలమైన సందేశమని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఈ సందర్భంగా బీసీ సంఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. బీసీల రాజకీయ సాధికారతకు ఇది నాంది అని, భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం కల్పించాలని నాయకులు కోరారు.రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి స్థానాలలో బీసీ లు ఆత్మ ధైర్యంతో బీసీ సంఘాల స్ఫూర్తి తో జనరల్ స్థానాలలో పోటీ చేసి గెలవాలని ఎంపిపి జెడ్పి చైర్మన్ లను కైవసం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గొట్టిపాముల బాబు రావు, నియోజకవర్గ అధ్యక్షుడు సాబన్ కార్ వెంకటేష్, భువనగిరి మండల అధ్యక్షుడు చిన్న మల్లేష్, శివకుమార్, పుమార్ విక్రమ్, కిషన్,చెన్నోజుల నరేంద్ర చారి,వడ్ల కొండ ఉపేంద్ర చారి, బలరాం,బ్రహ్మ చారి ప్రతాప్ చారి శ్రీధరా చారి, చక్రపాణి, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు

## రంజాన్ సందర్బంగా పీస్ మీటింగ్ లో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్



**భువనగిరి, ఫిబ్రవరి 18 (వెలుతురు):**

యాదాద్రి,భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం లొ,రంజాన్ మాసం ప్రారంభం,సందర్భంగా పోలీస్ మరియు,మున్సిపాలిటీ,ఇరిగేషన్ విద్యుత్ అదే విధంగా ఇతర అన్ని డిపార్ట్మెంట్ ల అధికారులతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ శాంతి సమావేశం లొ మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా అధ్యక్షులు పాల్గొని పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది..ఈ కార్యక్రమం లొ అన్ని మసీదులకు సంబంధించిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మరియు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మైనార్టీ నాయకులు,కుల పెద్దలు మత పెద్దలు పాల్గొన్నారు.

## రామోజు భవిష్య పుట్టినరోజున అన్నదానం



**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 18:**

బి.వెల్లెంల వాస్తవ్యులు, మైత్రి మెడికల్ హాల్ యాజమాన్యులు రామోజు నాగచారి నిహారిక దంపతుల కుమార్తె రామోజు భవిష్య జన్మదిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. "మనం స్వచ్ఛంద సంస్థ" ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 498వ రోజు సందర్భంగా నిరుపేదలు, నిస్సహాయులు, బిక్షాటన చేసేవారు మరియు బాటసారులకు ఉచిత భోజనం అందించారు. మనం సంస్థలో ఇది నాలుగోసారి అన్నదానం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రామోజు నాగచారి మాట్లాడుతూ తన జీవితంలోని ప్రతి ముఖ్యమైన రోజును నిరుపేదల ఆకలి తీర్చేందుకు వినియోగించుకోవడం తనకు ఇష్టమని చెప్పారు. ఈ సృష్టిలో ఆకలికన్నా పెద్ద లోటు మరొకటి లేదని, ప్రతి ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే భావనతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామోజు శ్రీకాంత్, సుజాత, పాగాడోజు నర్సింహాచారి, కోడి ప్రశాంత్, నాగరాజు, వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలి

**- పిఎసిఎస్ కేంద్రం ద్వారా రైతులకు పారదర్శకంగా పంపిణీ చేయాలి**

**- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి**

**- సిపిఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతి.**



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 18:**

మండలంలో రైతులకు సరిపడు యూరియా అందుబాటులో ఉంచి,ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా పారదర్శకంగా అందించాలని, రైతులను అయోమయానికి గురించేసే యాపును ఎత్తివేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ లాల్ బహుదూర్ కు మరియు మండల వ్యవసాయ అధికారులకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా విక్రయాన్ని యాప్ లో పెట్టడంతో డీలర్లకు దగ్గరికి వారికే విక్రయిస్తుండడంతో సాధారణ చిన్న, సన్న కారు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మండలంలో సుమారుగా 15 వేల యూరియా బస్తాలు అవసరం పడతాయని కలుపు తీసే వ్యవధి కూడా అయిపోతుందని ఇంకా పది రోజులు దాటిత యూరియాతో కూడా అవసరం ఉన్నదని అన్నారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని సింగల్ విండోలో రైతులకు యూరియా అందుబాటులో ఉంచి పారదర్శకంగా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా వ్యవసాయఅధికారి,మండల వ్యవసాయ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి బోయిని ఆనంద్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి నాగేష్, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు,భావండ్లపల్లి బాలరాజు శానకొండ రామచంద్రం, పల్లె సత్యం, వేములమల్లేశం,కన్నెబోయిన రాజా లింగం,తాటిపాముల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిగుండాలు గెలుపుతో మల్లన్న బ్రహ్మోత్సవాలకు ఉత్సాహభరిత ముగింపు

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 18:**



నిధానపల్లి యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిధానపల్లి గ్రామంలోని మల్లన్నగుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తి ఉత్సాహాల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. చిన్న శ్రీశైలంగా పేరుగాంచిన ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి పాదార్చనాభిషేకం, కళ్యాణం (తలంబ్రాలు) వైభవంగా నిర్వహించారు. వేదఘోషాలుమంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ దివ్య కల్యాణం ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక కాంతులతో నింపింది.అగ్నిగుండాలు ప్రధాన ఆకర్షణ బ్రహ్మోత్సవాల హైలెట్‌గా నిలిచింది అగ్నిగుండాల కార్యక్రమం .తెల్లవారుజామున నిర్వహించిన ఈ ఆచారంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండాలను గెలుచుకుంటూ భక్తులు చూపిన ఆత్మస్థైర్యం, విశ్వాసం అక్కడి వాతావరణాన్ని ఉత్కంఠభరితంగా మార్చింది. హర హర మహాదేవ' నినాదాలతో మల్లన్న గుట్టమారు మోగింది. కొండపై ఉన్న పవిత్ర కోనేటి స్నానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఈ కోనేటిలో స్నానం చేస్తే రోగాలు నివారించి శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. కొండల గుహల్లో మునుల తపస్సు జరిగిన ప్రదేశాలున్నాయని స్థానికులు చెబుతున్నారు. "స్వర్ణసింహ బ్రహ్మకంకణ పురస్కృతులు"శతాధిక ప్రతిష్టాచార్య, సిద్ధాంత కళాప్రపూర్ణ బ్రహ్మశ్రీ బేతోజు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అనంతరం త్రిశూలస్నానం, గెలుపు ఉత్సవం, ఉత్సవ సమాప్తి కార్యక్రమాలునిర్వహించారు. ముగింపులో గ్రామ పెద్దలు, దాతలను సన్మానించనున్నారు.

## శ్రీ మహాలక్ష్మి నారాయణుల కళ్యాణోత్సవ కార్యక్రమానికి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యేలను ఆహ్వానించిన దేవాలయ కమిటీ చైర్మన్ మారోజు వెంకటాచారి



**గట్టుప్పల్ వెలుతురు ఫిబ్రవరి 18:**

గట్టుప్పల్ మండలం నామాపురం గ్రామంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి నారాయణ కళ్యాణోత్సవం ఆహ్వాన శుభపత్రికను దేవాలయ చైర్మన్ మారోజు వెంకటాచారి వైస్ చైర్మన్ బొడ్డు జగన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ మరియు కాంగ్రెస్ పార్టీ నామాపురం గ్రామ శాఖ అధ్యక్షులు జాజుల యాదయ్య ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారికి హైదరాబాదులో వారి నివాసం వద్ద ఈరోజు ఇవ్వడం జరిగింది. నామాపురం గ్రామ ప్రజల ఇలవేలుపైన అమ్మవారి జాతరకు అదేవిధంగా కళ్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం పోయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరియు కోమటిరెడ్డి లక్ష్మి గార్లను కంచుకట్ల సంపత్ కోరినారు. కచ్చితంగా పాల్గొంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ నామాపురం గ్రామ శాఖ అధ్యక్షులు జాజుల యాదయ్య మహాలక్ష్మి దేవాలయ చైర్మన్ మారోజు వెంకటాచారి వైస్ చైర్మన్ బొడ్డు జగన్ ,కంచుకట్ల సుభాష్ రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడులో మున్సిపల్ ఎన్నికల్లో బిసి లకు సముచిత స్థానం పై హర్షం

**- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ని కలిసి అభినందనలు తెలిపిన బిసి యువజన సంఘం నాయకులు**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**

బిసిలకు జనరల్ స్థానాలలో మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ పదవులు కల్పించి బిసి లకు సముచిత స్థానం కల్పించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని హైదరాబాద్ లో వారి నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు బిసి నేతలు పానుగంటి విజయ్ గౌడ్, బూడిద మల్లికార్జున్ యాదవ్ చౌటుప్పల్, చండూరు మున్సిపాలిటీ లలో జనరల్ స్థానాలలో బీసీలకు చైర్మన్ , వైస్ చైర్మన్ పదవులను కట్టబెట్టడం శుభపరిణామామని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా బిసి లకు సముచిత స్థానం కల్పించలని విజ్ఞప్తి చేసారు. బిసి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్ , బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ ఏమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించి నేను ఎప్పుడైనా బడుగు బలహీన వర్గాలు,పేదల కోసం పాటుపడతానని, అన్ని వర్గాల అభ్యున్నతే తన ధ్యేయమన్నారు...యావత్ బిసి సమాజం పక్షాన ఏమ్మెల్యే గారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు....

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 18:**

అనారోగ్యంతో అకాల మరణం పొందిన చిరకాల స్నేహితుని కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముందుకువచ్చి మిత్రులు సరైన నిర్వచనాన్ని అందించారు. రామన్నపేట మండల కేంద్రానికి చెందిన గురుకు శివప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న రామన్నపేట ప్రభుత్వ పాఠశాల 2006-07 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమవంతుగా మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించారు. రూ.22,000 సేకరించిన నగదును బుధవారం మృతుని దశదినకర్మ రోజు కుటుంబ సభ్యులకు అందజేశారు.

## ఘనంగా సుపరిపాలన దినోత్సవం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 18:**

మండల కేంద్రంలోని సంజీవయ్య నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్గా సల్ల జానీ ,తహసిల్దారుగా సల్ల సుశాంత్, మండలాభివృద్ధి అధికారిణిగా గోర్ల హారిక ప్రధానోపాధ్యాయురాలిగా నకిరేకంటి లిఖిత మరియు వివిధ హోదాలలో విద్యార్థులు చక్కటి ప్రదర్శన చేస్తూ అలరించారు .ఈ కార్యక్రమానికి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీమతి సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమము లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఐటిపాముల జలజాక్షి అభినందించారు. అదేవిధంగా పాఠశాల అధ్యాపక బృందం నాగయ్య, పుష్పావతి, అబ్దుల్ రహీం,వసంతా దేవి, కుమారస్వామి, సునీత పాల్గొన్నారు.

## మిర్యాలగూడ మున్సిపల్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ గా బీసీలకు అవకాశం కల్పించాలి

**- బిఆర్ఎస్ పార్టీకి, మాజీ ఎమ్మెల్యే ఎన్.భాస్కరరావు గారికి విజ్ఞప్తి చేసిన బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**



**మిర్యాలగూడ వెలుతురు ఫిబ్రవరి 18:**

జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు అన్ని పార్టీలు కూడా సామాజిక న్యాయం పాటించి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా బీసీలకు అవకాశం కల్పించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే ఎన్. భాస్కర రావు గారిని విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ గతంలో టిఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ గా అగ్రకులాల వారిని నియమించిందని కనీసం వైస్ చైర్మన్ గా కూడా బీసీలకు అవకాశం ఇవ్వలేదని అన్నారు. కనీసం అధికారంలో లేనప్పుడైనా బీసీ లకు ఫ్లోర్ లీడర్ గా అవకాశమిచ్చి బీసీల పక్షపాతి టిఆర్ఎస్ పార్టీ అని నిరూపించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు యర్రబెల్లి దుర్గయ్య ధోనీటీ శేఖర్ మల్లికంటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని MVR కన్వెన్షన్ హాల్లో 20/02/2026 న జరిగే శత వసంతాల సమావేశానికి మమ్మల్ని ఆహ్వానిస్తున్న సీనియర్ బిజెపి నాయకులు న్యాయవాది గూడూరు శ్రీనివాస్

**మిర్యాలగూడ వెలుతురు ఫిబ్రవరి 18:**

## హిమాయత్ నగర్ డివిజన్లోని బజ్జికాన బస్తీలో పిల్లలకి కొత్త స్కూల్ యూనిఫార్మ్స్ అందించిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**
హిమాయత్ నగర్ డివిజన్లోని బజ్జికాన బస్తీలో ఉన్న అంగన్వాడి నందు బుధవారం రోజున పిల్లలకి కొత్త స్కూల్ యూనిఫార్మ్స్ ఇవ్వడం జరిగింది. ప్రైవేటు కిండర్ గార్డెన్స్ లో ఉన్న పిల్లలకు ఉండేలాగా చిన్న పిల్లలందరికీ మంచి స్కూలు యూనిఫార్మ్స్ ఇచ్చినందుకు బస్తీ వాసులైన పూర్ణచందర్ జోసఫ్ బాలకృష్ణ తదితరులు సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో అంగన్వాడి స్కూల్ పిల్లలకు కూడా ప్రైవేట్ స్కూల్లో చదివే లాంటి యూనిఫామ్స్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పిల్లలందరికీ యూనిఫామ్ లు ఇవ్వడంతోపాటు ఆ స్కూల్ నందు గల ఒక చిన్నారి పుట్టినరోజు కొత్త ట్రాన్స్ఫార్మర్ బిగించడం అన్ని రకాల పనులు కోరిక మేరకు చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో నదీమ్ ఇమామ్ సాబ్ సంజీవరెడ్డి అభిషేక్ రెడ్డి హితేష్ శేఖర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 23న చలో ఢిల్లీ ఓసి జెసి మహాధర్నా



**బషీర్బాగ్ వెలుతురు 18 ఫిబ్రవరి :**
ఓసిల హక్కుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 23న ఓసి జేఏసీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జాతీయ స్థాయిలోఓసి ల మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి తెలిపారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఓసి జేఏసీ రాష్ట్ర నాయకులతో మహా ధర్నా ఏర్పాట్ల గురించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అగ్రకులాలలోని దపేద విద్యార్థినీ,విద్యార్థులు రైతులు,మహిళలకు విద్య, ఉద్యోగ, ఉపాధి,రాజకీయ రంగాలలో జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తెచ్చే ఉద్దేశంతో రాజకీయాల కతీతంగా ఈ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేయాలని, ఓసి కులాల స్థితిగతుల అధ్యయనానికి జాతీయస్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లను ఈ ధర్నా ద్వారా ప్రభుత్వం ముందు ఉంచనున్నట్టు పోలాడి రామారావు తో పాటు నాయకులు తెలిపారు. 23వ తేదీ ఉదయం 11గంటల నుండి ప్రారంభమయ్యే ఈ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## గంజాయితో తయారు చేస్తున్న బంగ్..

**- 1.3 కేజీల బంగ్ గోళీల స్వాధీనం**
**200 గ్రాముల గంజాయి చాక్లెట్ల సీజ్.**



**బషీర్ బాగ్ వెలుతురు 18 ఫిబ్రవరి :**
గంజాయి అమ్మకాలు జరుపుతుంటే ఎక్సైజ్శాఖ పట్టుకుంటున్నారని భావించిన కొందరు అక్రమార్కులు గంజాయిని రుబ్బి గోళీలుగా తయారు చేసి వాటికి బంగ్ పేరుతో అమ్మకాలు జరుపుతున్నట్లుగా గుర్తించిన ఎస్టీఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డితో పాటు సిబ్బంది కలిసి చూడీబజార్, శంకర్ బజారులో ప్రాంతంలో ఉన్న లవకుశ్ ఇంట్లో తనిఖీలు చేపట్టి 1.30 కేజీల బంగ్ గోలీలను, 200 గ్రాముల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తర ప్రదేశ్కు చెందిన లవకుశ్ శర్మ ఇంటి నెంబర్ 14-7-159/10 మూడో అంతస్తులో ఉన్న ఇంట్లో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. ఇలా తయారు చేసిన బంగ్ గోలీని రూ. 100 చొప్పున అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కేసులో లవకుశ్ శర్మతో పాటు భాను ప్రతాప్లను అరెస్టు చేసి ధూళిపేట్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

## ఆర్య వైశ్య కార్పొరేషన్ లోగో ఆవిష్కరణ

**- అభినందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి**

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**






తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ అధికారిక లోగోను బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ , బెల్దే శ్రీధర్ , ఆకుల రమాకాంత్ , సరాపు సంతోష్ , బచ్చు చైతన్య , పార్సి ప్రకాష్ , దారం సతీష్ , నల్మాస్ దేవేందర్, రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మార్చి నెలలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన శ్రీ వాసవీ మహా శక్తి మహోత్సవం...సామూహిక పారాయణ కార్యక్రమం గురించి కల్వ సుజాత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు తెలిపారు . సుమారు 45 వేల మంది హాజరయ్యే ఈ కార్యక్రమం గిన్నీస్ ప్రపంచ రికార్డు సాధించబోతోందని వివరించారు. దానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కాల్వ సుజాతను, నిర్వాహకులను అభినందించారు.

## ఓటు పడేదాకా హామీల వర్షం..
# గెలిచినంక విగ్రహాలపై విషం!

**కరీంనగర్ వెలుతురు ప్రతినిధి ఫిబ్రవరి 18:**
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదర్శ గ్రామంగా పేరుగాంచిన ఒక పల్లెలో ఇప్పుడు రాజకీయ చదరంగం నడుస్తోంది. పచ్చని పొలాలు, పాడిపంటలతో కళకళలాడే ఆ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు అంశం చినికి చినికి గాలివానలా మారి శాంతిభద్రతల సమస్యగా పరిణమించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, సర్పంచులు ఆడుతున్న డ్రామాలు గ్రామస్తుల్లో తీవ్ర అసహనానికి దారితీస్తున్నాయి.
గత పంచాయతీ ఎన్నికల సమయంలో, గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, అందుకు భారీగా ఆర్థిక సాయం అందిస్తామని సదరు సర్పంచ్ అభ్యర్థి హామీ ఇచ్చారు. దీన్ని నమ్మిన యువత, గ్రామ పెద్దలు ఆయన గెలుపునకు సహకరించారు. అయితే, తీరా గెలిచిన తర్వాత జయంతి వేడుకల సమయం దగ్గరపడటంతో.. విరాళం ఇవ్వడం ఇష్టం లేక కొత్త ఎత్తుగడలకు తెరలేపారు. విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటే తను ఇవ్వాల్సిన డబ్బులు మిగులుతాయనే దురాలోచనతో, విగ్రహాలను వ్యతిరేకించే వ్యక్తులను ప్రేరేపించి అధికారులకు ఫిర్యాదులు చేయించడం గమనార్హం.

### ప్రైవేట్ స్థలంలోనూ అడ్డంకులు!

సర్పంచ్ కుయుక్తులను గమనించిన గ్రామస్తులు, స్వచ్ఛందంగా చందాలు వేసుకుని విగ్రహాన్ని కొనుగోలు చేశారు. ఒక దాత ముందుకు వచ్చి తన సొంత స్థలాన్ని ఇవ్వడంతో అక్కడ విగ్రహ ప్రతిష్టకు సిద్ధమయ్యారు. కానీ, అక్కడికి కూడా రాజకీయ ఒత్తిళ్లు చేరాయి. విగ్రహ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న గ్రామ పెద్దలను పోలీస్ స్టేషన్కు పిలిపించి, బైండోవర్ కేసులు పెడతామని స్థానిక ఎస్సై బెదిరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### ప్రభుత్వ శాఖల తీరుపై విస్మయం

ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో, ఇప్పుడు ప్రజలు జాతీయ భావాలతో ముందుకొస్తుంటే.. వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకట్ట వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఆర్థిక భారం తప్పించుకోవడానికి సర్పంచులు వర్గాల మధ్య చిచ్చు పెడుతున్నారని, దీనికి పోలీసులు, రెవెన్యూ శాఖలు వత్తాసు పలకడం ఏమిటని మేధావులు ప్రశ్నిస్తున్నారు.

### జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి?

కేవలం ఈ ఒక్క గ్రామంలోనే కాదు, ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో ఇదే తరహా రాజకీయాలు సాగుతున్నాయని వివిధ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. విగ్రహాలు పెడతామని ఓట్లు వేయించుకుని, ఇప్పుడు లక్షల రూపాయల ఖర్చు తప్పించుకోవడానికి స్థల యజమానులను, ఇతర వర్గాలను రెచ్చగొడుతూ శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నారు. అధికారులు సర్పంచుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రజల అభీష్టం మేరకు వ్యవహరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కామారెడ్డి లో దొంగతనం చేసేందుకు
# దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టారు.

**కామారెడ్డి వెలుతురు ఫిబ్రవరి 18:**
ఇంట్లోకి ప్రవేశించి దాదాపు 8 నిమిషాల పాటు వెతికన దొంగలు.. ఏకంగా ఇంట్లో ఉన్న బీరువాను ఎత్తుకెళ్లారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ ఎస్పిఆర్ స్కూల్ సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటన సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యింది. ఓల్డ్ ఎస్పిఆర్ స్కూల్ సమీపంలో నివాసం ఉండే షమీ, మున్నీసాబేగం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. దీన్ని గమనించిన దుండగులు ఫిబ్రవరి 16వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. 3.40 గంటల సమయానికి చిన్న మెటల్ బీరువాతో ఇంట్లో నుంచి బయటికి వచ్చి దర్జాగా మోసుకుపోయారు. అందులో 2 తులాల బంగారం, కొంత నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు.



పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగల గురించి ఆరా తీస్తున్నారు.

## రాబోయే పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా నగరపాలక సంస్థ నుండి అవసరమైన ఏర్పాట్లు చేయండి...

**- మేయర్ కోలగని శ్రీనివాస్ తో బిజెపి మైనార్టీ మోర్చా నేతలు....**

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 18:**
రాబోయే పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరుతూ బుధవారం రోజున కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్ కు బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముజీబ్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొహమ్మద్ బషీరుద్దీన్ , జిల్లా ప్రధాన కార్యదర్శి సమీయుల్లా అహ్మద్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సిద్దిక్ లు వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ లోని మస్జిద్ పరిసర ప్రాంతాలు, మైనారిటీ వార్డుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. రమజాన్ సందర్భంగా మస్జిద్ల వద్ద సరైన వీధి దీపాలు, పరిశుభ్రత, ఇఫ్తార్ అనంతరం చెత్త తొలగింపు, తగినంత నీటి సరఫరా,



సేహరీ సమయాల్లో హోటళ్లను ఆలస్యంగా నిర్వహించేందుకు అనుమతి, తరావీహ్ నమాజ్ సమయంలో అవసరమైతే తాత్కాలిక రహదారి మూసివేతలు, భద్రతా ఏర్పాట్లు పెంపు మరియు దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజ్ మరమ్మతులు చేయాలని కోరారు. పవిత్ర రమజాన్ మాసం శాంతియుత వాతావరణంలో జరగడానికి మున్సిపల్ యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# జహీరాబాద్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

## అభివృద్ధి, పారదర్శక పాలనకే ప్రజల మద్దతు...

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**
సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం పట్టణ రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది. పట్టణాభివృద్ధి కాంగ్రెస్తోనే సాధ్యమని విశ్వసించిన ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జహీరాబాద్ ప్రజల తీర్పు ప్రజాస్వామ్యానికి నిదర్శనమని, అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం పట్ల కాంగ్రెస్పై ప్రజలు ఉంచిన విశ్వాసానికి ఇది ప్రతీక అని అన్నారు. ఎన్నికల నిర్వహణలో పార్లమెంట్ ఇంచార్జిగా మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, కో-ఆర్డినేటర్గా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ చైర్మన్ మహమ్మద్ ఫహీమ్ ఖురేషి, పార్లమెంట్ సభ్యులు సురేష్కుమార్ శెట్కార్ మార్గదర్శకత్వంలో సమన్వయంతో పక్కా వ్యూహం అమలు చేయడం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని వివరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చంద్రశేఖర్, మాజీ టీజీఐడిసి చైర్మన్ మహ్మద్ తన్వీర్, సిడిసి చైర్మన్, ఆత్మ కమిటీ చైర్మన్, పట్టణమండల కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కృషి అభినందనీయమని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తూ పట్టణంలో మౌలిక సదుపాయాల విస్తరణ, డ్రైనేజ్, రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని



తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి వర్గానికి అందుబాటులో ఉండే విశ్వసనీయ పాలన అందిస్తూ జహీరాబాద్ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని నాయకులు స్పష్టం చేశారు.

# నేడు ఛత్రపతి శివాజీ జయంతి

**- జర్నలిస్టులకు జాతీయ సేవా పురస్కారాల ప్రదానం**




**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**
భాగ్యనగర్ శివాజీ సేవాసమితి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శివాజీ జయంతి సందర్భంగా గురువారం జర్నలిస్టులకు జాతీయ సేవా పురస్కారాల ప్రదానం చేయనున్నారు. కేంద్ర మంత్రి కిషన్రెడ్డి సహా పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. గత 28 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న వారికి ఏటా పురస్కారాలు ఇస్తున్నట్లు భాగ్యనగర్ శివాజీ సేవాసమితి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నందనం దివాకర్ తెలిపారు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 60 మంది పాత్రికేయులను సన్మానిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు సేంద్రియ రైతులు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వాతంత్ర్య సమర యోధులు, కవులు-రచయితలు, పర్యావరణవేత్తలు, కార్గిల్యోధులు, అయోధ్య కరసేవకులు... ఇలా అనేక రంగాల వారికి జాతీయ సేవా పురస్కారాలు ప్రదానం చేసినట్లు వివరించారు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ మండలం రంగారెడ్డి నగర్. శివాజీ చౌక్ వద్ద గురువారం సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని నందనం దివాకర్ కోరారు.

## మంచాల గ్రామంలో 1.2.3వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకున్న గ్రామసర్పంచ్

**- రెండు మూడు రోజులో త్రాగునీటి సమస్య పరిష్కారం చేస్తాం గ్రామసర్పంచ్ ఏర్పుల మానస వినయ్**



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 18:**
మంచాల మండలం మంచాల గ్రామంలోని 1వ వార్డు 2 వార్డు 3వ వార్డులోత్రాగునీరుసక్రమంగా సర పరాకావటంలేదు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు అని17వ తేదీ రోజువార్డుల ప్రజలు గ్రామపంచా యతీ కార్యాలయానికి వచ్చి గ్రామపంచాయతీకార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ కు విన్నవిం చుకున్నారు వెంటనే స్పందించిన మంచాల గ్రామసర్పంచ్ ఏర్పుల మానసవినయ్ గ్రామ కార్యద ర్శి శ్రీనివాస్ గౌడ్ కలిసివెళ్లి1వ వార్డు2వ వార్డు3వ వార్డులో పర్యటించిప్రజలసమస్యలు తెలుసుకు న్నారు త్రాగునీటి సమస్య ఉన్నది అని చెప్పడంతో స్పందించిన గ్రామసర్పంచ్ మానస వినయ్ రెండుమూడు రోజుల్లో త్రాగునీటి సమస్య నమస్కారంచేస్తాను అని సమాధానం చెప్పారు ఈ సందర్భంగా సర్పంచ్ మానస వినయ్ మాట్లాడుతూ ప్రజాలకు ఇలాంటి సమస్యలుఎదురైన స మస్యల పరిష్కారం కోసం పనిచేస్తాం ఏసమస్యఉన్న నాదృష్టికి తీసుకురండి అనిఅన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రావులశ్రీనివాస్ రావుల ఆనంద్ తదితరులుపాల్గొన్నారు

## మంచాలలో జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష మరియు కంటి ఆపరేషన్లు వైద్య శిబిరం



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 18:**
మంచాల మండలం కేంద్రంలోజన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ ఫోకస్ ఐ హాస్పి ట ల్ బంజారాహిల్స్ సహకారంతో మంచాల భారతీయ జనతా పార్టీకార్యాలయంలోఉచిత కంటి ప రీక్షా శిబిరం మొత్తం70మంది కంటి పరీక్షలు చేయడం జరిగింది అందులో 13 మందికి ఆపరేష న్లు గుర్తించడం జరిగింది ఈకార్యక్రమంలో జన సందేశ్ ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి ప్రధా నకార్యదర్శి దన్నే బాషయ్య వార్డు సభ్యుడు వింజమూరి వెంకట్ రెడ్డి డాక్టర్ ఎంఎస్ రెడ్డి మరి యు నిర్వాహకుడు అశ్వాల బాలరాజు డాక్టర్ ఎస్కేబిక్షపతి పగడాలజంగయ్యనారెడ్డి నరసిం హా రెడ్డి జలమోనిబిక్షపతి బోగిని నరసింహా ఏరుకొండ బాలరాజ్ జలజ మంజుల దివ్య పసులకృష్ణ గ్రామస్తులుతదితరులుపాల్గొన్నారు

# శ్రీ శ్రీ శ్రీ ఆత్మానందమయి అమ్మవారి దివ్య సన్నిధిలో గ్రంథావిష్కరణ మహోత్సవం

**- భోగ సిద్ధర్ మహావతార్ బాబాజీ సుషుమ్న క్రియా యోగ గ్రంథానికి ఆవిష్కరణ**

**- విశాఖలో ఆధ్యాత్మిక ఉత్సాహం దేశ విదేశాల నుంచి సాధకుల భారీ హాజరు**

**విశాఖపట్నం, వెలుతురు ఫిబ్రవరి18 :**

ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువులు పూజ్యులు శ్రీ శ్రీ శ్రీ ఆత్మానందమయి అమ్మవారి దివ్య సన్నిధిలో "భోగ సిద్ధర్ మరియు మహావతార్ బాబాజీ సుషుమ్న క్రియా యోగ" గ్రంథావిష్కరణ కార్యక్రమం విశాఖపట్నంలోని గాదిరాజు ప్యాలెస్‌లో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మహోత్సవం ఘనంగా జరిగింది. దేశ విదేశాల నుండి పెద్ద సంఖ్యలో సాధకులు, భక్తులు హాజరై కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నింపారు. ఈ సందర్భంగా పూజ్యులు ఆత్మానందమయి అమ్మవారు సుషుమ్న క్రియా యోగ సాధనకు సంబంధించిన సూక్ష్మ తత్త్వాలను విశదీకరించారు. అనంతరం అనేక మంది సాధకులకు సుషుమ్న క్రియా యోగ దీక్షను ప్రసాదించారు. సుషుమ్న క్రియా యోగ ధ్యానం ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే శక్తిని, అంతర బలాన్ని, మానసిక ప్రశాంతతను ప్రసాదించే ప్రభావవంతమైన



ఆధ్యాత్మిక సాధనగా వారు వివరించారు.

మహోత్సవ ప్రధాన ఆకర్షణలు:

సుషుమ్న క్రియా యోగ దీక్ష

మహా లింగ బిల్వార్చన

సుస్వర భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలు

మహా లింగోద్భవ ధ్యాన కార్యక్రమం

ఈ వేడుకలో ప్రధాన ఘట్టంగా పూజ్యులు రచించిన గ్రంథావిష్కరణ ఘనంగా జరిగింది. పలువురు ప్రముఖులు హాజరై కార్యక్రమానికి మరింత గౌరవాన్ని చేకూర్చారు. భక్తి, ఆనందం, ఆధ్యాత్మిక పరవశతల మధ్య మహోత్సవం విజయవంతంగా ముగిసింది. ప్రవేశం అందరికీ ఉచితంగా ఉండగా, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సమాజంలోని ప్రతి ఒక్కరికీ





చేరవేయాలనే సంకల్పాన్ని ఈ వేడుక పునరుద్ఘాటించింది.

## చారిత్రక పరిశోధన బలోపేతానికి

# అవగాహన ఒప్పందం

**నల్లగొండ వెలుతురు ఫిబ్రవరి 18:**

బీఏ హిస్టరీ (చరిత్ర)విద్యార్థులకు పరిశోధనలో మంచి అవకాశాలు లభించేందుకుగాను తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ విభాగం, హైదరాబాద్





మరియు ప్రభుత్వ మహిళా కళాశాల,నల్లగొండ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. ఈ అవగాహన ఒప్పందం పై తెలంగాణ హెరిటేజ్ విభాగం తరుపున డైరెక్టర్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్ రావు ప్రభుత్వ మహిళా కళాశాల తరుపున ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసరాజు సంతకాలు చేసి పరస్పరం పత్రాలు అందజేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా చరిత్ర విద్యార్థులకు హెరిటేజ్ పరిశోధనలు,విద్యా కార్యక్రమాలు,సెమినార్లు,టూరిస్ట్ గైడు ట్రైనింగ్ లు,శిక్షణా శిబిరాలు,అకడమిక్ సహకారం,చారిత్రక స్థలాల పరిశోధన మరియు పురావస్తు త్రవ్వకాలు మరింత బలోపేతం కానున్నాయని డిపార్ట్ మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు తెలిపారు.ఈ ఒప్పందం విద్యార్థుల పరిశోధనకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ డాక్టర్ పీ.నాగరాజు, ఏడీ మల్లు నాయక్, సూపరింటెండెంట్ రాజు, హిస్టరీ అధ్యాపకులు మంగ ఉప్పలయ్య, ఎస్ కె. ఉస్మాన్ పాష, లైబ్రేరియన్ డాక్టర్ సుంకరి రాజారాం, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ నరేష్ గార్లు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిలర్లకు ఆత్మీయ సన్మానం

**మోత్కూరు: ఫిబ్రవరి 18, (వెలుతురు న్యూస్ ):**



మోత్కూరు మున్సిపల్ పరిధిలోని ఇటీవల గెలిచిన గౌడ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లు గనగాని శైలజ, నర్సయ్య గౌడ్, బీసు శ్రీకాంత్ గౌడ్, కారుపోతుల వెంకన్న గౌడ్ లను కంఠమహేశ్వర స్వామి కమిటీ ఆధ్వర్యంలో ఆ ఆలయం వద్ద పూలమాలలు,శాలువాలతో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బత్తిని శ్రీనివాస్, బుర్ర కృష్ణ ,లోడే యాదయ్య సూధగాని యాదగిరి గౌడ్,చాపల అంజయ్య, బైరగోని ఉపేందర్ , బుర్ర శ్రీనివాస్ గౌడ్, గనగాని చంద్రయ్య బుర్ర లచ్చయ్య, బుర్ర శ్యాం ప్రసాద్, బుర్ర యాదయ్య, లోడే రాజు, బుర్ర నర్సయ్య,బోయిని లచ్చయ్య , బుర్ర రాములు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్ లకు,వార్డ్ సభ్యులకు రెండవ రోజు శిక్షణా కార్యక్రమం.



**మోత్కూర్, ఫిబ్రవరి 18,(వెలుతురు న్యూస్ ):**

ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో కొత్తగా ఎన్నుకోబడిన వార్డ్ సభ్యులకు, సర్పంచ్ లకు 5 రోజుల శిక్షణా కార్యక్రమం లో భాగంగా రెండవ రోజు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం లో నాయకత్వ లక్షణాలు, ఘణ, ద్రవ వ్యర్థల నిర్వహణ, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యుల విధులు, బాధ్యతలు, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై ట్రైనర్ లు సైదిరెడ్డి,హుస్సేన్, అబ్దుల్ ఖాదిర్ లు సభ్యులకు శిక్షణ ను ఇచ్చారు. కార్యక్రమం లో ఎంపీడీఓ బాలాజీ నాయక్, ఎంపీవో జనార్దన్ రెడ్డి మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## మొదటిరోజు మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ తొలి సమావేశం





**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 18 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ముందుగా కౌన్సిలర్లు పరస్పరం పరిచయాలు చేసుకుని తమ తమ వార్డుల సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా పట్టణంలోని ప్రతి వార్డులో నీటి సమస్యపై చర్చ జరిగింది. సింగూరు మరమ్మతుల కారణంగా రాబోయే వేసవి కాలంలో తీవ్ర నీటి సమస్య తలెత్తే అవకాశమున్నందున ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. అలాగే మురికి కాలువలను శుభ్రంగా ఉంచడం, పట్టణంలో లో వోల్టేజ్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం, మందిరాలు, మసీదులు, చర్చిల వద్ద పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు చైర్మన్ నాగేష్ శెట్కార్ గారిని సన్మానించగా, అనంతరం మున్సిపల్ సిబ్బంది కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుడిలా టీ దుకాణంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





**చౌటుప్పల్ వెలుతురు ఫిబ్రవరి 18:**

చౌటుప్పల్ లో స్థానిక ప్రజలతో మమేకమవుతూ ఎమ్మెల్సీ నెల్లికంటి కంటి సత్యం పట్టణంలోని ఓ సాధారణ టీ దుకాణంలో టీ తాగుతూ కనిపించారు. ఎటువంటి ఆటంబరాలు లేకుండా, హంగులు లేకుండా సామాన్యుడిలా కూర్చొని టీ తాగుతూ స్థానికులతో చర్చించడం అక్కడివారిని ఆకట్టుకుంది. ప్రజా ప్రతినిధిగా ఉన్నప్పటికీ ప్రజల మధ్య ఉండాలని తన ఉద్దేశమని ఈ సందర్భంగా సత్యం పేర్కొన్నారు. టీ తాగుతూ స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పట్టణంలో నీ నిరుద్యోగ యువత సమస్య, పరిశ్రమల కాలుష్యంవల్ల అనారోగ్య పాలవుతున్నారని , రోడ్ల దుస్థితి సమస్య ఇబ్బందులపై పలువురు నివేదించగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.పదవి ప్రజల సేవ కోసం మాత్రమే నని ప్రజల మధ్యన ఉంటేనే వారి కష్టాలు తెలుస్తాయని సత్యం వాఖ్యనించారు. టీ దుకాణం వద్ద సాధారణంగా కూర్చొని ఉండటం చూసిన స్థానికులు ఆయన సరళతను ప్రశంసించారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, తీర్పారి వెంకటేశ్వర్లు, బదుల సుధాకర్, రెహమాన్ ఉన్నారు.

## కెసిఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**

తెలంగాణ జాతిపిత స్వరాష్ట్ర సాధకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసిఆర్ ) జన్మదినాన్ని పురస్కరించుకుని ఎర్రవల్లి లోని వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలసి వారికి జన్మదిన శుభకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారుడు పిట్టల నరేష్ ముదిరాజ్

## ఎల్లారెడ్డి చైర్మన్ ను కలిసిన ఖేడ్ పద్మశాలీలు





**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 18 :**

సంగారెడ్డి జిల్లా :- కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన పద్మ శ్రీకాంత్ ను నారాయణఖేడ్ పద్మశాలీ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వం కలిసి,చైర్మన్ తో పాటు వివిధ వార్డు కౌన్సిలర్లకు శాలువాలు,పూలదండలతో సన్మానం చేశారు. ఫిబ్రవరి 23న నిర్వహించనున్న మార్కండేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయ చైతన్యంగా ఎదగాలన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడంలో అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ పద్మశాలి సంఘం అధ్యక్షులు గున్నాల నర్సింలు, ఉపాధ్యక్షులు సామల సంగన్న,మెట్టు శ్రీనివాస్, కోశాధికారి చిప్ప అనంతం,యువజన సంఘం జనరల్ సెక్రటరీ గోస్కె శ్రీనివాస్,ఎల్లారెడ్డి పట్టణ కృష్ణ క్లాత్ స్టోర్ ఓనర్ కృష్ణ లు ఉన్నారు.

## వనస్థలిపురంలో దారుణ ఘటన

**- విడాకులు తీసుకున్న భార్యను హత్య చేసిన దుండగుడు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 18 ( వెలుతురు):**

హైదరాబాద్ వనస్థలిపురం గ్రీన్ సిటీ కాలనీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సునీత (30)ను ఆమె మాజీ భర్త మహేష్ అత్యంత కిరాతకంగా హత్య చేయడం కలకలానికి గురిచేసింది. పోలీసులు కథనం ప్రకారం.. సునీత కొన్ని రోజుల క్రితమే మహేష్‌కు విడాకులు ఇచ్చి రెండో వివాహం చేసుకుంది. దీంతో మాజీ భర్త లేపేసేందుకు ప్లాన్ వేశాడు. దీంతో తాజాగా మహేష్ రెండు కత్తులు, పెట్రోల్ డబ్బాతో సునీత ఇంట్లోకి చొరబడ్డాడు. ముందుగా ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం కత్తులతో తీవ్రంగా గాయపరిచాడు. పూలకుండీతో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. సునీత రక్తపు మడుగులో పడిఉండగా, మహేష్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పరారీలో ఉన్న మహేష్‌ను కొద్ది గంటల్లోనే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విడాకులు తీసుకుని మరో వివాహం చేసుకోవడాన్ని సహించలేకపోయిన మహేష్ ఈ హత్యకు పాల్పడ్డాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## శ్రీశైలంకు ధనసిరి నుంచి 31వ మహా పాదయాత్ర ఘనారంభం

**- 9200 మందికి పైగా భక్తులతో శివనామ స్మరణల మధ్య పయనం...**



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ధనసిరి గ్రామం నుండి శ్రీశైలంకు మహాపాదయాత్ర బుధవారం సాయంత్రం బయలుదేరింది. ధనసిరి, మొగుడంపల్లి, గుడుపల్లి తదితర ప్రాంతాల 200మంది భక్తులు శ్రీశ్రీశ్రీ 108 వీరేశ్వర శివాచార్యుల ఆధ్వర్యంలో శ్రీశైలం పయనం అయ్యారు. ఇది 31వ మహా పాదయాత్ర నిర్వహించడం గొప్ప విషయం. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా అదనంగా వందలాది భక్తులు ధనసిరి చేరుకొని యాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్ర ధనసిరి నుంచి



మొదలుకాగా కర్ణాటక రాష్ట్రంలోని చించొల్లి, తెలంగాణలోని తాండూర్, కొడంగల్, కోస్గి, మహబూబ్‌నగర్, అచ్చంపేట్, మననూర్ మార్గాల ద్వారా శ్రీశైలం చేరనుంది. భక్తులు ప్రతిరోజూ నడక కొనసాగిస్తూ, మార్గమధ్యంలోని ఆలయాల్లో విశ్రాంతి తీసుకుంటారని నిర్వాహకులు తెలిపారు. పాదయాత్ర ద్వారా భక్తులకు ఆయుష్, ఆరోగ్యం, సుఖ సంతోషాలు లభిస్తాయని వీరేశ్వర శివాచార్యులు పేర్కొన్నారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10 రోజుల యాత్ర సవ్యంగా జరగాలని పూజలు చేసారు. శివారు వరకు ఆయా గ్రామాల ప్రజలు తోడుగా వెళ్లారు. ధనసిరిలో శివనామంతో మారుమ్రోగింది.

## మహాశివరాత్రి వేడుకల్లో వైభవంగా ఉమామహేశ్వరుల కళ్యాణం

**- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం....**

**- నూతన మహిళా కౌన్సిలర్లకు సన్మానం...**

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆర్యవైశ్య సంఘం జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో ఉమామహేశ్వర స్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య, సంప్రదాయ పద్ధతుల్లో స్వామివార్ల కళ్యాణం వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన నూతన మహిళా కౌన్సిలర్లు నామ స్రవంతి రవికిరణ్, అన్నపూర్ణ అశోక్ షెరి, మజ్జిగ సుజిత విశ్వేశ్వర్, ప్రేమలత శంకర్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల ఆశీర్వాదాలు స్వీకరించి, మహోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి హారతులు ఇచ్చారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి



స్వామివార్ల దివ్య దర్శనం చేసుకున్నారు. ఉమామహేశ్వరుల కల్యాణాన్ని తిలకించిన వారికి శాంతి, సౌఖ్యం, ఐశ్వర్యం కలుగుతాయని పండితులు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు నూతన మహిళా కౌన్సిలర్లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు. ఈ వేడుకల్లో సంఘం సభ్యులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అస్థిర అంతర్జాతీయ వ్యవస్థలో - భారత రాజకీయ దిశ!



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**

పౌర సంబంధాల అధికారి

యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్.

కాకతీయ విశ్వవిద్యాలయం.

ప్రపంచ రాజకీయ వ్యవస్థ 2019 తరువాత గణనీయమైన మార్పులను ఎదుర్కొంది. 2020 లో కోవిడ్ మహమ్మారి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను 3.1% సంకోచానికి గురిచేసింది. ప్రపంచ బ్యాంక్ గణాంకాల ప్రకారం 2020 లో ప్రపంచ పేదరికం సుమారు 9.2% కు పెరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నిరుద్యోగం 6% నుండి 8% వరకు పెరిగినట్టు అంతర్జాతీయ కార్మిక సంస్థ పేర్కొంది. 2021 లో ప్రపంచ ఆర్థిక వృద్ధి 5.9% కు పుంజుకున్నా, అది సమానంగా అన్ని దేశాలకు ప్రయోజనం కలిగించలేదు. 2022 లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తరువాత ప్రపంచ ద్రవ్యోల్బణం 8.8% వరకు పెరిగింది. యూరప్ దేశాల్లో ఇంధన ధరలు 30% నుండి 60% వరకు పెరిగాయి. ఆహార ధాన్యాల ధరలు ప్రపంచవ్యాప్తంగా సుమారు 20% పెరిగాయి.

అమెరికా రాజకీయంగా 2020 ఎన్నికల తరువాత తీవ్ర విభజనకు గురైంది. 2024 ఎన్నికల సమయం వరకు డెమొక్రటిక్-రిపబ్లికన్ ధ్రువీకరణ గణనీయంగా పెరిగింది. ప్యూ రీసెర్చ్ 2023 నివేదిక ప్రకారం అమెరికా ఓటర్లలో 65% మంది ప్రత్యర్థి పార్టీని దేశానికి ప్రమాదంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది రాజకీయ అసహన స్థాయిని సూచిస్తుంది. అదే సమయంలో చైనా 2021 నుండి 2025 మధ్య తన రక్షణ ఖర్చును సుమారు 7% చొప్పున ప్రతి సంవత్సరం పెంచింది. ప్రపంచ శక్తి సమీకరణంలో అమెరికా-చైనా పోటీ ప్రధాన అక్షంగా మారింది.

యూరోపియన్ యూనియన్ లో 2022-2024 మధ్య కుడిపక్ష జాతీయవాద పార్టీలు గణనీయమైన ఓట్లను సంపాదించాయి. ఫ్రాన్స్ లో 2022 అధ్యక్ష ఎన్నికలలో కుడిపక్ష అభ్యర్థి సుమారు 41% ఓట్లు పొందడం, ఇటలీలో 2022 ఎన్నికలలో కుడిపక్ష కూటమి 44% ఓట్లు సాధించడం గమనార్హం. వలసలు, ఇంధన సంక్షోభం, ధరల పెరుగుదల ఈ మార్పుకు ప్రధాన కారణాలు. జర్మనీ లో 2023 లో ద్రవ్యోల్బణం 6% పైగా నమోదైంది. యూరప్ మొత్తం మీద 2022 లో సహజ వాయువు ధరలు 200% వరకు పెరిగాయి.

మధ్యప్రాచ్యంలో 2023-2025 కాలంలో భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. చమురు ధరలు 2022 లో బ్యారెలుకు ఽ120 వరకు చేరాయి. ఆర్థిక స్థిరత్వం కోసం కొన్ని దేశాలు సబ్సిడీలను 15% వరకు పెంచాయి. అయితే ఇది ప్రభుత్వాల బడ్జెట్ లోటును 5% నుండి 8% వరకు పెంచింది. ఆఫ్రికా దేశాల్లో 2022-2024 మధ్య ఆహార కొరతకు గురైన జనాభా 20% వరకు పెరిగినట్లు యునైటెడ్ నేషన్స్ నివేదిక పేర్కొంది.

సాంకేతిక రంగంలో 2023 నుండి కృత్రిమ మేధస్సు వేగంగా విస్తరించింది. 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా ౄ× ఆధారిత సేవల మార్కెట్ ఽ500 బిలియన్ దాటింది. అయితే అదే సమయంలో టెక్నాలజీ రంగంలో ఉద్యోగ కోతలు 2023 లో మాత్రమే సుమారు 2 లక్షల మంది వరకు జరిగాయి. డిజిటల్ మార్పులు వేగంగా జరుగుతున్నప్పటికీ ఉద్యోగ భద్రతపై అనిశ్చితి పెరిగింది.

ఈ ప్రపంచ పరిణామాలు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ద్వంద్వ ప్రభావం చూపాయి. ఒకవైపు సరఫరా గొలుసు మార్పులతో కొన్ని దేశాలకు పెట్టుబడులు పెరిగాయి. మరోవైపు ద్రవ్యోల్బణం, రుణభారం పెరిగింది. ప్రపంచ రుణ భారం 2023 నాటికి గ్లోబల్ జిడిపి లో 238% కు చేరింది. ఇది 2019 తో పోలిస్తే గణనీయమైన పెరుగుదల.

ఇప్పుడు భారతదేశ పరిస్థితులపై పరిశీలిస్తే 2020 లో భారత జిడిపి -6.6% వరకు క్షీణించింది. 2021 లో 8.7% వృద్ధి నమోదైంది. 2022 లో 7% వృద్ధి కొనసాగింది. 2023 లో 7.2% వృద్ధి నమోదైనట్టు అధికార గణాంకాలు పేర్కొన్నాయి. అయితే వృద్ధి శాతం ఉన్నప్పటికీ ఉపాధి సృష్టి తగినంతగా జరగలేదనే విమర్శలు ఉన్నాయి. 2022 లో యువ నిరుద్యోగం సుమారు 23% గా నమోదైంది. గ్రామీణ నిరుద్యోగం పట్టణాల కంటే అధికంగా 8% వరకు నమోదైంది.

రాజకీయంగా 2014 లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ 2019 లో 303 లోక్‌సభ స్థానాలు గెలుచుకుంది. 2024 సాధారణ ఎన్నికల్లో పార్టీ సీట్ల సంఖ్య తగ్గినా అతిపెద్ద పార్టీగా కొనసాగింది. ప్రతిపక్ష కూటమి ఇండియా సుమారు 40% ఓట్లు పొందినట్టు ఎన్నికల విశ్లేషణలు సూచించాయి. ఇది ద్వంద్వ రాజకీయ ధోరణి బలపడుతున్న సంకేతం.

ద్రవ్యోల్బణం 2022 లో 6.7% వరకు చేరింది. ఆహార ద్రవ్యోల్బణం కొన్ని నెలల్లో 8% దాటింది. ఉల్లిపాయలు, టమోటాలు వంటి కూరగాయల ధరలు కొన్ని రాష్ట్రాల్లో 100% పైగా పెరిగిన సందర్భాలు నమోదయ్యాయి. ఇంధన ధరలు 2022 లో లీటరుకు రూపాయలు 100 దాటడం మధ్యతరగతి ఖర్చులను ప్రభావితం చేసింది.

సామాజికంగా మత, కుల ఆధారిత చర్చలు రాజకీయ వేదికలపై ప్రధాన అంశాలుగా మారాయి. సోషల్ మీడియా వినియోగం 2024 నాటికి భారతదేశంలో 80 కోట్లకు పైగా చేరింది. రాజకీయ ప్రచారం డిజిటల్ వేదికలపై 60% కంటే ఎక్కువగా జరిగిందని అధ్యయనాలు సూచించాయి. ఇది అభిప్రాయ విభజనను వేగవంతం చేసింది.

రాష్ట్రస్థాయిలో మార్పులు గమనించదగ్గవి. దక్షిణ భారత రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా నిలుస్తున్నాయి. ఉత్తర రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. ఇది ప్రాంతీయ-జాతీయ రాజకీయ సమీకరణాన్ని సూచిస్తుంది.

ఆర్థిక అసమానతల విషయంలో 2023 నివేదికల ప్రకారం దేశ సంపదలో టాప్ 10% వర్గం సుమారు 65% వాటా కలిగి ఉంది. బాటమ్ 50% వర్గం వాటా 13% మాత్రమే. ఇది ఆదాయ అసమానత పెరుగుతున్న సంకేతం.

ప్రజలపై ప్రభావం మూడు ప్రధాన దిశల్లో కనిపిస్తోంది. మొదటిది జీవన వ్యయం పెరుగుదల. రెండవది ఉపాధి అనిశ్చితి. మూడవది రాజకీయ ధ్రువీకరణ వల్ల సామాజిక ఉద్రిక్తత. 2025 నాటికి పట్టణ మధ్యతరగతి కుటుంబ ఖర్చులు 2019 తో పోలిస్తే 25% పెరిగాయి. విద్య, ఆరోగ్య రంగాల్లో ఖర్చులు 30% పెరిగినట్లు సర్వేలు సూచించాయి.

అయితే మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు పెరిగాయి. 2023-2024 బడ్జెట్ లో మూలధన వ్యయం 33% పెంచబడింది. రహదారుల నిర్మాణం రోజుకు 30 కి.మీ పైగా కొనసాగుతున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. డిజిటల్ చెల్లింపులు 2024 లో ఽ200 లక్షల కోట్ల లావాదేవీలను దాటాయి.

మొత్తంగా ప్రపంచ రాజకీయ అస్థిరత, యుద్ధాలు, ద్రవ్యోల్బణం భారతదేశంపై పరోక్ష ప్రభావం చూపుతున్నాయి. దేశీయ రాజకీయ పోటీ తీవ్రత పెరుగుతోంది. ప్రజలు అభివృద్ధి, ఉపాధి, ధరల నియంత్రణ అంశాలపై మరింత చైతన్యంతో స్పందిస్తున్నారు. 2026 వరకు రాజకీయ సమీకరణాలు మరింత మారే అవకాశం ఉంది.

సారాంశంగా 2020 నుండి 2026 వరకు ప్రపంచ రాజకీయ వ్యవస్థలో అస్థిరత, ఆర్థిక ఒత్తిడి, జాతీయవాద పెరుగుదల ప్రధాన లక్షణాలు. భారతదేశంలో వృద్ధి శాతం ఉన్నప్పటికీ ఉపాధి, ధరల పెరుగుదల, సామాజిక సమీకరణ అంశాలు ప్రధాన సవాళ్లు. ప్రజల జీవిత ప్రమాణం రాజకీయ నిర్ణయాలపై నేరుగా ఆధారపడి ఉంది. రాబోయే సంవత్సరాలు ప్రజల ఆర్థిక భద్రత, సామాజిక ఐక్యత, ప్రజాస్వామ్య బలపాటుపై కీలకంగా నిలవనున్నాయి.

2.ఇప్పటివరకు విశ్లేషించిన ప్రపంచ రాజకీయ-ఆర్థిక పరిణామాలు, భారతదేశంలోని ప్రస్తుత రాజకీయ ధోరణులు, సామాజిక మార్పులు, ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావాలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించినపుడు భవిష్యత్ దిశను అంచనా వేయడం అత్యంత అవసరమవుతుంది. 2020 తరువాత ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన అస్థిరత తాత్కాలిక దశ కాదనే విషయం 2022, 2023, 2024 గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. ప్రపంచ ద్రవ్యోల్బణం 2022 లో 8.8% వరకు చేరడం, 2023 లో 6% పైగా కొనసాగడం, 2024 లో కూడా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 5% కంటే ఎక్కువగా ఉండటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం ఇంకా పూర్తిగా పునరుద్ధరించబడలేదని సూచిస్తోంది. ప్రపంచ రుణభారం 2023 నాటికి గ్లోబల్ జిడిపి లో 238% కు చేరడం ఆర్థిక వ్యవస్థలపై దీర్ఘకాలిక ఒత్తిడిని సూచించే ప్రధాన సూచిక.

భౌగోళిక రాజకీయాల పరంగా చూస్తే 2022 లో ప్రారంభమైన యుద్ధ పరిస్థితులు ప్రపంచ సరఫరా గొలుసులను మార్చాయి. 2021 వరకు ఒకే ప్రాంతంపై ఆధారపడిన ఉత్పత్తి విధానం 2024 నాటికి విభజిత సరఫరా విధానంగా మారింది. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలకు పెట్టుబడుల అవకాశాలను తీసుకొచ్చినప్పటికీ ప్రపంచ వాణిజ్య వృద్ధి 2018 లో ఉన్న 5% స్థాయి నుండి 2023 నాటికి 3% చుట్టూ స్థిరపడింది. అంటే వాణిజ్య విస్తరణ మందగించింది. ప్రపంచ పెట్టుబడుల ప్రవాహం 2022 లో 12% తగ్గింది. 2023 లో కొంత పుంజుకున్నప్పటికీ 2019 స్థాయికి ఇంకా చేరలేదు.

ప్రపంచ రాజకీయ ధోరణుల్లో మరో ముఖ్య అంశం ప్రజాస్వామ్య వ్యవస్థలపై విశ్వాసం తగ్గడం. 2023 అంతర్జాతీయ సర్వేల ప్రకారం అనేక దేశాల్లో 40% కంటే ఎక్కువ మంది యువత ప్రభుత్వాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది రాజకీయ ప్రత్యామ్నాయాల కోసం వెతకడానికి దారి తీస్తోంది. జాతీయవాద ధోరణులు 2020 తరువాత గణనీయంగా పెరిగాయి. వలసల సమస్య, ఆర్థిక అసమానత, భద్రతా భయాలు ఇవన్నీ ఈ ధోరణికి ప్రేరణగా మారాయి.

ఈ ప్రపంచ పరిణామాల ప్రభావం భారతదేశంపై ద్వంద్వ స్వరూపంలో కనిపిస్తోంది. ఒకవైపు 2021 తరువాత భారత ఆర్థిక వృద్ధి 7% పైగా కొనసాగడం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచింది. మరోవైపు యువ నిరుద్యోగం 2022 లో 23% చుట్టూ ఉండటం, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి నాణ్యతపై ప్రశ్నలు తలెత్తడం ఆర్థిక వృద్ధి సమానంగా విస్తరించడం లేదని సూచిస్తోంది. 2023 నాటికి టాప్ 10% వర్గం దేశ సంపదలో 65% వాటా కలిగి ఉండటం అసమానతను బలంగా చూపిస్తుంది. బాటమ్ 50% వర్గం వాటా 13% మాత్రమే ఉండటం ఆదాయ పంపిణీ సమతుల్యతలో లోపాన్ని తెలియజేస్తుంది.

రాజకీయంగా చూస్తే 2014 తరువాత ఏర్పడిన బలమైన కేంద్ర నాయకత్వం 2019 లో మరింత బలపడింది. 2024 ఎన్నికల తరువాత కేంద్రంలో అధికార పార్టీ సీట్లు తగ్గినా ప్రధాన శక్తిగా కొనసాగింది. ప్రతిపక్ష కూటములు 40% వరకు ఓట్లు సాధించడం రాజకీయ సమీకరణం మారుతున్న సంకేతం. ఇది ద్వంద్వ రాజకీయ వ్యవస్థ బలపడుతున్నదని సూచిస్తుంది. ఈ పరిస్థితి 2026 వరకు కొనసాగితే విధాన చర్చలు మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉంది.

ద్రవ్యోల్బణం ప్రజలపై నేరుగా ప్రభావం చూపిన ప్రధాన అంశం. 2022 లో 6.7% సగటు ద్రవ్యోల్బణం, కొన్ని నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం 8% పైగా ఉండటం కుటుంబాల ఖర్చులను పెంచింది. 2019 తో పోలిస్తే 2025 నాటికి పట్టణ మధ్యతరగతి కుటుంబ ఖర్చులు 25% పెరిగాయి. విద్య ఖర్చులు 30% పెరిగాయి. ఆరోగ్య ఖర్చులు 28% పెరిగాయి. ఇంధన ధరల పెరుగుదల రవాణా వ్యయాలను 20% పైగా పెంచింది. ఈ మొత్తం ప్రభావం జీవన ప్రమాణంపై ఒత్తిడిని పెంచింది.

అయితే మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు పెరగడం భవిష్యత్ వృద్ధికి పునాది వేస్తోంది. 2023-24 బడ్జెట్ లో మూలధన వ్యయం 33% పెరగడం, రహదారి నిర్మాణం రోజుకు 30 కి.మీ స్థాయికి చేరడం, డిజిటల్ లావాదేవీలు 200 లక్షల కోట్లకు చేరడం ఆర్థిక వ్యవస్థ డిజిటలైజేషన్ వైపు వేగంగా సాగుతున్న సంకేతాలు. 2025 నాటికి యూపీఐ లావాదేవీలు నెలకు 1000 కోట్ల ట్రాన్సాక్షన్లు దాటడం ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరుగుతున్నదని సూచిస్తోంది.

సామాజిక పరంగా డిజిటల్ మీడియా ప్రభావం గణనీయంగా పెరిగింది. 2024 నాటికి భారతదేశంలో సోషల్ మీడియా వినియోగదారులు 80 కోట్లకు పైగా చేరడం రాజకీయ ప్రచారం విధానాన్ని పూర్తిగా మార్చింది. ఎన్నికల ప్రచారంలో 60% కంటే ఎక్కువ వ్యయం డిజిటల్ వేదికలపై జరిగినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది సమాచార వేగాన్ని పెంచినప్పటికీ అపోహలు, తప్పుడు ప్రచారం వ్యాప్తిని కూడా పెంచింది. రాజకీయ ధ్రువీకరణ 2020 తరువాత స్పష్టంగా పెరిగింది. కుటుంబాలు, స్నేహిత వర్గాలు రాజకీయ అభిప్రాయాల ఆధారంగా విభజించబడుతున్నాయని సర్వేలు పేర్కొంటున్నాయి.

భవిష్యత్ దిశలో మూడు ప్రధాన అంశాలు కీలకం. మొదటిది ఉపాధి సృష్టి. భారతదేశంలో ప్రతి సంవత్సరం సుమారు 1.2 కోట్ల మంది యువత ఉద్యోగ మార్కెట్ లోకి ప్రవేశిస్తున్నారు. ఈ స్థాయిలో ఉపాధి అవకాశాలు సృష్టించకపోతే 2026 తరువాత నిరుద్యోగ ఒత్తిడి మరింత పెరుగుతుంది. రెండవది ధరల స్థిరీకరణ. ద్రవ్యోల్బణం 4% లక్ష్యానికి చేరకపోతే మధ్యతరగతి ఆదాయం వాస్తవ విలువ తగ్గుతుంది. మూడవది సామాజిక ఐక్యత. రాజకీయ ధ్రువీకరణ నియంత్రణలో లేకపోతే సామాజిక శాంతి దెబ్బతింటుంది.

ప్రపంచ స్థాయిలో కూడా 2026-2030 కాలం కీలకం. గ్రీన్ ఎనర్జీ మార్పు వేగవంతమవుతోంది. 2024 లో ప్రపంచ పునరుత్పాదక శక్తి పెట్టుబడులు 1 ట్రిలియన్ దాటాయి. భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక శక్తి లక్ష్యాన్ని ప్రకటించింది. ఇది సక్రమంగా అమలు అయితే ఇంధన దిగుమతులపై ఆధారపడటం 20% వరకు తగ్గే అవకాశం ఉంది. దీని వల్ల చెల్లింపుల సమతుల్యత మెరుగుపడుతుంది.

మొత్తంగా 2020 నుండి 2026 వరకు ప్రపంచ రాజకీయ-ఆర్థిక పరిస్థితులు అస్థిరత, పునర్వ్యవస్థీకరణ, డిజిటల్ మార్పు, జాతీయవాద పెరుగుదలతో కూడిన దశగా నిలిచాయి. భారతదేశం ఈ పరిస్థితుల్లో వృద్ధి సాధించినప్పటికీ ఉపాధి, అసమానత, ధరల నియంత్రణ, సామాజిక సమీకరణ అంశాల్లో ఇంకా సవాళ్లు ఎదుర్కొంటోంది. ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం జీవన వ్యయం పెరుగుదల, ఉపాధి భద్రత లోపం, రాజకీయ చర్చల తీవ్రత రూపంలో కనిపిస్తోంది.

రాబోయే సంవత్సరాల్లో రాజకీయ నాయకత్వం సమతుల్య ఆర్థిక విధానాలు అవలంబించి, 6% కంటే తక్కువ ద్రవ్యోల్బణాన్ని లక్ష్యంగా పెట్టుకుని, 8% పైగా స్థిరమైన వృద్ధి సాధించి, ప్రతి సంవత్సరం కనీసం 1 కోటి కొత్త ఉద్యోగాలు సృష్టించగలిగితే ప్రజల విశ్వాసం పెరుగుతుంది. లేకపోతే 2026 తరువాత రాజకీయ సమీకరణాలు మరింత వేగంగా మారే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే పారదర్శక పాలన, సమగ్ర అభివృద్ధి, సామాజిక ఐక్యత మూడు మూలస్తంభాలుగా నిలవాలి.

# రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

**- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు**



**హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు):**

రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. ఈ మేరకు సచివాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఐ.టి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కమిషనర్ శశాంక, ఐటి శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే సంస్థలకు పూర్తి స్థాయిలో తగు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసారు. ఇప్పటికే, రాష్ట్ర ముఖ్యమంత్రి గారు పలు మార్లు డేటా సెంటర్ల ఏర్పాటుపై సమీక్ష సమావేశాలను ఏర్పాటు చేశారని అన్నారు. డేటా కేంద్రాల ఏర్పాటుకు పొరుగు రాష్ట్రాలను మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్ లతో పాటు ఉత్తరప్రదేశ్ లలో ఇస్తున్న రాయితీలపై చర్చించారు. డాటా సెంటర్ల ఏర్పాటుకు 100 శాతం గ్రీన్ ఎనర్జీ సోర్స్ సౌకర్యం, కావాల్సిన విద్యుత్ ను బహిరంగ సేకరణ ద్వారా పొందడం, డెడికేటెడ్ పవర్ సప్లై నెట్వర్క్ ఎస్.జి.ఎస్.టి రీ-ఇంబర్సుమెంట్ తదితర అభ్యర్థనలు డేటా సెంటర్ల ఇన్వెస్టర్లు కోరుతున్నందున, ఈ అంశాలపై అధ్యయనం చేయాలని సి.ఎస్ సూచించారు. ఈ డేటా సెంటర్ల ఏర్పాటుతో రాష్ట్రం లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలతో పాటు అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు.

# మక్తల్‌లో 20 నుంచి 24 వరకు సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

**- తెలంగాణ రాష్ట్రం గర్వపడేలా కబడ్డీ పోటీలు నిర్వహణ**

**- క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఏర్పాట్లు**

**- పోటీల ఏర్పాట్లపై అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి టెలికాన్ఫరెన్స్**



**హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు):**

మక్తల్‌లో సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను జాతరలా నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మక్తల్‌లో ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించే కబడ్డీ పోటీల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం కప్-2026లో భాగంగా మక్తల్ పట్టణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని, వీటిని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. కబడ్డీ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకోవాలని మంత్రి దిశానిర్దేశర చేశారు. ఈనెల 20 నుంచి 24 వరకు కబడ్డీ పోటీలు జరుగనుండటంతో అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు సీరియస్‌గా తీసుకోని పనిచేయాలని ఆదేశించారు. మక్తల్ లో నిర్వహించే కబడ్డీ పోటీలు ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా నిలిచేలా నిర్వహణ ఉండాలని అభిప్రాయపడ్డారు. అందుకోసం అతిథ్యం, స్టేడియం, ఇతర ఏర్పాట్లపై దృష్టి సారించాలని అధికారులకు మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఈ కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు 33 జిల్లాలనుంచి క్రీడాకారులు రానుండటంతో అన్ని ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చే వారికి వసతులు తదితర అంశాల్లో ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా చూసుకోవాలని తెలిపారు. క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులను కబడ్డీ పోటీల్లో భాగస్వాములను చేయాలని విద్యాశాఖ అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఈ కబడ్డీ పోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అతిథులుగా హాజరవుతున్నారని, వారందరిని గౌరవించుకోవాలని సూచించారు. పోలీస్, స్పోర్ట్స్, శానిటరీ, మున్సిపల్, విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడూ జిల్లా ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ కబడ్డీ పోటీలను విజయవంతానికి కృషిచేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా కబడ్డీ పోటీలను సవాల్‌గా తీసుకోని అధికారులతో కలిసి ముందుకుపోవాలని మంత్రి చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా క్రీడల అధికారి, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవో అధికారులు, మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతులు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికల్లో 61శాతం బీసీలుగెలుపు

**- తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్**

**హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు):**

రాష్ట్రంలో జరిగిన పురపాలక ఎన్నికల్లో బీసీలు మొత్తంగా 61శాతంనకు పైగా గెలవటం పట్ల బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, హర్షం వ్యక్తం చేశారు. ఈ మధ్య జరిగిన పంచాయితీ ఎన్నికల్లో జనరల్ స్థానాలలో కూడా బీసీ అభ్యర్థులు 52.75 శాతం గెలిచిన విషయం విదితమే. మున్సిపల్ ఎన్నికల్లో, మున్సిపల్ వార్డులలో బీసీలకు 28.22శాతం , మున్సిపల్ కార్పోరేషన్‌లలో మొత్తం వార్డులలో 35.25శాతం బీసీలకు కేటాయించినా జనరల్ స్థానాలలో కూడా బీసీలు గెలిచి, మొత్తం మీద 61శాతం గెలవటం బీసీ వర్గాల ప్రజలలో పెరిగిన చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు.

రాబోయే జెడ్‌పిటిసి, ఎంపిటిసి, జిహెచ్‌ఎంసి, కార్పొరేషన్ల ఎన్నికల్లో కూడా బీసీలు అత్యధికంగా గెలుస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఃూష్ట్రంలో జరిగిన సమగ్ర సర్వేలో బీసీల సంఖ్య 56.33శాతం అని తేలగా, రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినా అది ఇంకా కేంద్ర ప్రభుత్వంలో పెడ్డింగ్‌లో ఉండటం, కొందరు కోర్టు కెళ్లి ఈ రిజర్వేషన్ అమలు కాకుండా చేయడం సముచితం కాదు. త పంచాయతీ ఎన్నికల్లో, ఇప్పుడు జరిగిన పురపాలక ఎన్నికల్లో బీసీలు గెలిచిన స్థానాలను దష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లకు అమలు చేయడానికి అనుమతినివ్వాలని, 9వ షెడ్యూల్‌లో పెట్టాలని, అదేవిధంగా కోర్టుల్లో కేసులు వేసిన వారు కూడా వారి కేసులను ఉపసంహరించి చట్టబద్ధంగా బీసీల రిజర్వేషన్లు సాకారమయ్యే మార్గం సుగమం చేయాలని బీసీ కమిషన్ కోరుకుంటుంది.

# అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

**అమరావతి,ఫిబ్రవరి 18 ( వెలుతురు):**

అసెంబ్లీ సమావేశాలు వీక్షించడానికి బుధవారం కూడా కొందరు విద్యార్థులు వచ్చారు. ఈ క్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు విద్యార్థులతో మాటామంతి నిర్వహించారు. అసెంబ్లీలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయని విద్యార్థులను ప్రశ్నించారు. చర్చలు బాగా జరుగుతున్నాయని విద్యార్థులు చెప్పారు. సీఎం చంద్రబాబును చూడాలని ఉందని చెప్పారు విద్యార్థులు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ విశాఖపట్నం రావడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అక్కడికి వెళ్లారని అధికారులు చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు చూసిన పలువురు విద్యార్థులు తమకు పోలవరం ప్రాజెక్టు కూడా చూడాలని ఉందన్నారు. ఈసారి నుంచి విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టుని కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాటి చ్చారు. తమకు అసెంబ్లీ సమావేశాలు నేరుగా చూడటం కొత్త అనుభూతి కలిగిందని విద్యార్థులు పేర్కొన్నారు.

## చిన్నారి హత్యకేసు నిదితుడు
# కులవర్ధన్ ఆత్మహత్య

-చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసుల గుర్తింపు

- అతనది ఆత్మహత్యే అని ఎస్పీ నిర్ధారణ



**అన్నమయ్య, ఫిబ్రవరి18( వెలుతురు):**
మదనపల్లిలో ఏడేళ్ల చిన్నారి దారుణ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కులవర్ధన్ మృతదేహం కురబలకోట మండలం కనసానిపల్లె చెరువులో లభ్యమైంది. అతను ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించారు. చిన్నారి హత్య కేసుపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియాతో మాట్లాడుతూ.. కురబలకోట మండలం కనసానిపల్లె చెరువులో బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతదేహాన్ని కులవర్ధన్‌గా అతని బంధువులు గుర్తించారని ఎస్పీ చెప్పారు. మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. కులవర్ధన్ బంధువులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. మంగళవారం కులవర్ధన్‌ను అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా.. పోలీసుల నుంచి తప్పించుకుని అతడు పారిపోయాడని తెలిపారు. అతని ఆచూకీ కోసం మూడు బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. బుధవారం ఉదయం చెరువులో కులవర్ధన్ మృతదేహం తేలినట్లు తెలిసిందన్నారు. ప్రాథమిక విచారణలో అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడించారు.

# హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు పూర్తి


- కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్థులు



**కడప, ఫిబ్రవరి18( వెలుతురు):**
అన్నమయ్య జిల్లా మదనపల్లిలో దారుణ హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు కన్నీటి వీడ్కోలు మధ్య ముగిశాయి. మదనపల్లిలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి చేసి హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ హత్యకు గురైన బాలిక అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన కడప జిల్లా వీరబల్లి మండలం రాగిమానుదిన్నెపల్లిలో నిర్వహించారు. అంత్యక్రియలకు బంధువులు, స్థానికులు, అన్నమయ్య, కడప జిల్లాల టీడీపీ నేతలు హాజరయ్యారు. అందరూ కన్నీటితో బాలికకు చివరి వీడ్కోలు పలికారు. అంత్యక్రియలకు ముందే, ఈ కేసులో నిందితుడు కులవర్ధన్ మృతిచెందాడు. అన్నమయ్య జిల్లా కరసానివారిపల్లి చెరువులో అతడి మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో ముదివేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు దీనిని ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. బాలిక అంత్యక్రియలకు ముందే నిందితుడు కులవర్ధన్ మరణంపై మృతురాలి బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

# మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

- అరెస్ట్ చయకుండా వేసిన పిటిషన్ తిరస్కరణ




**అమరావతి, ఫిబ్రవరి18( వెలుతురు):**
విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో సినీనటుడు, మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) ఛాన్సలర్ మోహన్‌బాబుకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆయన చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. కిడ్నాప్‌నకు ముందు, తర్వాత వర్సిటీ పీఆర్వో సతీష్‌తో మోహన్‌బాబు మాట్లాడారని, మెసేజ్‌లు పంచుకున్నారని పోలీసులు చెబుతున్న విషయాన్ని గుర్తుచేసింది. ప్రధాన వ్యాజ్యంపై లోతైన విచారణ జరుపుతామంటూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మార్చి 3కు వాయిదా వేశారు. ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్ వ్యవహారంలో మోహన్ బాబు ప్రత్యక్ష ప్రమేయం ఉందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే బౌన్సర్లను అరెస్ట్ చేశారు.

# వైసిపి ఎమ్మెల్యేతో టిడిపి ఎమ్మెల్యేల సరదా

**అమరావతి, ఫిబ్రవరి18( వెలుతురు):**
అసెంబ్లీ ఆవరణలో తెదేపా ఎమ్మెల్యేలకు వైకాపా ఎమ్మెల్యే చంద్రశేఖర్ తారసపడ్డారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, అశోక్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డిలను వైకాపా ఎమ్మెల్యే పలకరించారు. ఈ సందర్భంగా వీరి మధ్య సరదా చిట్‌చాట్ జరిగింది. బిల్ గేట్స్ స్థాయి తెలియకుండా విమర్శించే స్థాయికి మీ పార్టీ దిగజారిపోయిందని తెదేపా ఎమ్మెల్యేలు ఆయనను అడిగారు. అసెంబ్లీకి వచ్చి బ్జడెట్ లెక్కలు అడగకుండా.. ప్రెస్‌మీట్ పెట్టి బిల్‌గేట్స్ టీ, కాఫీ ఖర్చులంటూ నవ్వులపాలయ్యారుగా.. అని ఎంఎస్ రాజు ఎద్దేవా చేశారు. అన్నీ తెలిసే నన్ను ఆడుకుంటున్నారుగా... మీకో నమస్కారం అంటూ చంద్రశేఖర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

# రాజకీయ రొచ్చులోకి హీరోయిన్లు

- తెలంగాణలో రకుల్.. తమిళంలో త్రిష


**చెన్నై, ఫిబ్రవరి18( వెలుతురు):**
అమ్మ, ఆలి, చెల్లి... ఆడవాళ్ళ ప్రస్తావన లేకుండా తిట్టు చూద్దాం అని ఓ సినిమాలో విలన్‌కు సవాల్ విసురుతాడు హీరో. ఇప్పుడు రాజకీయ నాయకులకు సైతం ఈ విధమైన సవాల్ విసరాలేమో!? హీరోయిన్లను అడ్డు పెట్టుకుని విమర్శలు వద్దని, కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని! ఎందుకంటే... తెలంగాణలో రకుల్ ప్రీత్ సింగ్, తమిళనాడులో త్రిషను కొందరు నేతలు తమ స్వార్థం కోసం రాజకీయాల్లోకి లాగుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేశారు.త్రిషకు, రాజకీయాలకు సంబంధం లేదు. ప్రత్యేక్షంగా ఎవరికీ, ఏ రాజకీయ పార్టీకి త్రిష మద్దతు ఇచ్చిన సందర్భాలు లేవు. కానీ, ఇప్పుడు తమిళ రాజకీయాలు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. అందుకు కారణం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావడం.తమిళ రాజకీయాల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని దళపతి విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మిగతా రాజకీయ పార్టీలు ఆయనపై కత్తి కట్టాయి. అది సహజం. విజయ్ 'జన నయగన్' విడుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అందులో రాజకీయ కోణం చూస్తున్నారు కొందరు. నిజానిజాలు పక్కన పెడితే... విజయ్ వరకు సంబంధించిన వ్యవహారం అది.విజయ్ మీద విమర్శలు గుప్పించే క్రమంలో తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ అడుగు ముందుకేసి... త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు రావాలని కామెంట్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై విజయ్ - త్రిష అభిమానులు, మహిళా సంఘాలు భగ్గుమన్నాయ్. తెలంగాణలోనూ ఈ విధమైన నీచ రాజకీయాలు ఇటీవల జరిగాయి.భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు (కేఆర్ఆర్)కు, కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ముడి పెడుతూ విమర్శలు చేశారు, ఇంకా చేస్తున్నారు ప్రత్యర్థులు. ఆ మధ్య సమంత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా విమర్శలు చేసి తర్వాత క్షమాపణలు చెప్పారు కొండా సురేఖ. తెలంగాణ రాజకీయ విమర్శల్లో అప్పుడప్పుడూ సురేఖా వాణి పేరూ వినిపిస్తూ ఉంటుంది. ఆ మధ్య తమిళనాడు రాజకీయాల్లో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్', విశ్వక్ సేన్ 'ఫంకీ' హీరోయిన్ కయాదు లోహర్ పేరు



హైలైట్ అయ్యింది. ఎందుకు? రాజకీయాల్లో హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు? ఇప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి కాదు... సామాన్యుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. విలువలతో కూడిన రాజకీయాలను కొందరు ఎప్పుడో వదిలేశారు. కనీసం ఆడవాళ్లను తీసుకు రాకుండా రాజకీయాలు చేయలేరా? సినిమాల్లో విజయ్ - త్రిషది హిట్ పెయిర్. కొన్ని సినిమాలు చేసిన హీరో హీరోయిన్ల మధ్య పరిచయం ఉంటుంది. సినిమాల్లో ఉన్నట్టు బయట ఉంటారని విమర్శలు చేయడం ఎంత వరకు సబబు? అసలు రాజకీయాలతో సంబంధాలు లేని రకుల్ పేరు లాగడం ఎందుకు??తమిళనాడులో త్రిష... తెలంగాణలో రకుల్... రాజకీయాలకు సాఫ్ట్ టార్గెట్ కింద మారారు. సినిమాల్లో నటించడం, తమ పని ఏదో తాము చూసుకోవడం తప్ప ఈ తరహా రాజకీయ విమర్శలకు బదులు ఇవ్వరు. ఒకవేళ ఇస్తే మళ్ళీ మళ్ళీ వచ్చే రాజకీయ విమర్శలు అన్నిటికీ బదులు ఇవ్వవలసి ఉంటుంది. అందుకని, త్రిష - రకుల్ మౌనం వహిస్తున్నారు. విమర్శలను వాదిస్తున్నారు. దాంతో కొందరు రాజకీయ నాయకులు - వాళ్ళ అనుచరులకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో హీరోయిన్లపై వ్యక్తిత్వ దాడి కొనసాగిస్తోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# రాజకీయామా నీదే పార్టీ

**హైదరాబాద్, ఫిబ్రవరి18( వెలుతురు):**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి.ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల



ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# ఆర్గానిక్ వస్తువుల కోసం యాప్


**హైదరాబాద్, ఫిబ్రవరి18( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను సిద్ధం చేస్తోంది. నకిలీల నుంచి విముక్తి కల్పించేలా యాప్ తీసుకొస్తున్నారు. ఈ యాప్‌లో సమగ్ర సమాచారం ఉండేలా ప్లాన్ చేశారు. అటు రైతులు, ఇటు ప్రజలకు ఉపయోగంగా ఉండేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.తెలంగాణలో రైతులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కొంతకాలంగా ప్రజలు ఆర్గానిక్ ఉత్పత్తులు ఉపయోగిస్తున్నారు.. కొంతకాలంగా విక్రాలు కూడా పెరిగాయి. ఇదే క్రమంలో ఆర్గానిక్ పేరుతో నకిలీవి కూడా మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.. అసలు ఏదో, నకిలీవి ఏవో తెలియడం లేదు.. రైతులు కూడా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఓ యాప్‌ను తీసుకొస్తోంది. త్వరలోనే ఆర్గానిక్ యాప్‌ను సిద్ధం చేస్తామని అధికారులు చెబుతున్నారు. రైతులు వారి ఉత్పత్తులతో ఆదాయం పెంచుకునేందుకు ఈయాప్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సాగును ప్రోత్సహించేందుకు రాయితీలూ ఇవ్వనుంది.తెలంగాణలో 50వేల ఎకరాల్లో 10వేలమంది వరకు రైతులు ఆర్గానిక్ వ్యసాయం చేస్తున్నారు. వరితో పాటుగా కూరగాయలు, నూనె గింజలు, పప్పుధాన్యాలు సాగు చేస్తున్నారు. మరికొందరు రైతులు పండ్ల తోటలు కూడా సాగు చేస్తున్నారు. రైతులు ఈ ఆర్గానిక్ సాగు



కోసం ఎలాంటి పురుగుల మందు, ఎరువులు, ఇతర కెమికల్స్ ఉపయోగించరు. కేవలం జీవ పదార్థాలతో పంటల్ని సాగు చేస్తారు. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెటింగ్ ఎలా చేయాలో తెలియని పరిస్థితి. వీరు షాపులు, షాపింగ్ మాల్స్, షాపులకు ఈ ఉత్పత్తుల్ని పంపిస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తుల్ని పెద్దగా ఎగుమతి కూడా చేయడం లేదు.ఆర్గానిక్ విత్తనాలు, ఉత్పత్తులకు 2015లో టీఎస్ఎం-వోసీఏ (తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆర్గానిక్ ఉత్పత్తుల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.. లైసెన్స్ వచ్చిన తర్వాత లేబుల్స్‌తో ఈ ఉత్పత్తుల్ని విక్రయించాల్సి ఉంటుంది. అయితే తెలంగాణలో 200 సంస్థలు లైసెన్సులు తీసుకున్నాయి. రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలామంది రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు. కొందరు రైతులు వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు. తాము నకిలీ ఉత్పత్తుల కారణంగా నష్టపోతున్నామని మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషల్‌గా యాప్ తీసుకురావాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ క్రమంలో యాప్‌ను సిద్ధం చేస్తున్నారు.టీఎస్ఎస్‌వోసీఏ (తెలంగాణ విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) యాప్ ద్వారా సమాచారాన్ని పొందుపరుస్తారు. ఈ మేరకు రాష్ట్రంలో ఏ రైతు, ఏ పంట సాగు చేస్తున్నారో, ఎక్కడ సాగు చేస్తున్నారో, ఆ ఉత్పత్తులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో వివరాలు అందుబాటులో ఉంటాయి. రైతుల సమాచారం (అడ్రస్, మొబైల్ నంబర్, ఫోటోలు, వీడియోలు) నమోదు చేస్తారు. ఈ యాప్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన యాప్‌ను కనెక్ట్ చేస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తులు కొనుగోలు చేయడం.. ఎగమతుల సంస్థల వివరాలు కూడా ఉంటాయి. ఉత్పత్తులకు సంబందించిన వివరాలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

# జీవన్ రెడ్డికి కాంగ్రెస్ షాక్..

**కరీంనగర్, ఫిబ్రవరి18( వెలుతురు):**
జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు తమ వర్గానికి చెందిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి వారి మధ్య సయోధ్య కుదర్చేందుకు చర్చలు జరిపారు. చివరికి కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డికి బిగ్ షాకిచ్చింది. జగిత్యాల చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికే కట్టబెడుతూ నిర్ణయించింది.జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 25 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 23 చోట్ల, స్వతంత్రులు 15 చోట్ల గెలుపొందారు. బీజేపీ ఆరు, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం రెండు స్థానాలు గెలుచుకుంది.కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం నుంచి 33 మంది పోటీ చేయగా 14మంది, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గం నుంచి 17 మంది పోటీ చేయగా తొమ్మిది మంది విజయం సాధించారు. స్వతంత్రుల్లో తొమ్మిది మంది జీవన్ రెడ్డి వర్గం కాగా.. నలుగురు ఎమ్మెల్యే వర్గీయులు, ముగ్గురు బీజేపీ రెబల్స్ ఉన్నారు.ఈ క్రమంలో చైర్మన్ పీఠం కోసం జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్ పోటీ పడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు రంగంలోకి



దిగారు. జీవన్ రెడ్డితో పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా సంజయ్ వర్గానికి చైర్‌పర్సన్ పదవి అప్పగించేందుకు నిర్ణయించారు.జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ గా సంజయ్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది. భవిష్యత్తులో జడ్పీటీసీ, మార్కెట్ కమిటీ పదవుల విషయంలో ప్రాధాన్యత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ పెద్దలు జీవన్ రెడ్డికి హామీ ఇవ్వడంతో ఆయన వెనక్కు తగ్గినట్లు తెలిసింది. దీంతో గత రెండు రోజులుగా జీవన్ రెడ్డి వర్సెస్ సంజయ్ కుమార్ మధ్య జరుగుతున్న వార్ లో పార్టీ పెద్దలతో సహకారంతో సంజయ్ కుమార్ పంతం నెగ్గించుకున్నట్లయింది.

# అల్లు, అట్లీల మూవీ రికార్డు

## అనౌన్స్‌మెంట్ సాంగ్‌కు మిలియన్ వ్యూయర్స్


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ ప్రాజెక్ట్ ఎఎ23. కేవలం ఒక చిన్న అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సరికొత్త చరిత్రను సృష్టించింది ఈ కాంబో. అయితే సినిమా కోసం సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ పాటను కంపోజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పాట ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును అందుకుంది. ఈ పాటకి ఇన్‌స్టాలో 1 మిలియన్ కంటే ఎక్కువ రీల్స్ అందుకున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో ఒక ఇండియన్ ఫిల్మ్ అనౌన్స్‌మెంట్ థీమ్ ఈ స్థాయిలో వైరల్ అవ్వడం ఇదే తొలిసారి అని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అరుదైన ఘనత సాధించిన సందర్భంగా అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలిసి దిగిన ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ 2026లో ప్రారంభం కానుంది.



# భార్య సురేఖకు చిరు ఎమోషనల్ బర్త్ డే విషెస్

హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) ఫిబ్రవరి 18 :






## ది కేరళ స్టోరీ సీక్వెల్..ట్రైలర్ విడుదల

# సంచలనం సృష్టిస్తున్న ట్రైలర్

2023లో బాక్సాఫీస్ వద్ద వివాదాలు సృష్టించిన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఈ ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో పెను దుమారం రేపుతోంది. మొదటి భాగం కంటే ఈ సీక్వెల్ మరింత వివాదాస్పదంగా, అత్యంత తీవ్రమైన అంశాలతో రూపొందినట్లు ట్రైలర్ చూస్తుంటే స్పష్టమవుతోంది. రాబోయే 25 ఏళ్లలో భారత్ ఇస్లామిక్ రాజ్యంగా మారుతుంది అనే వివాదాస్పద డైలాగ్‌తో ఈ ట్రైలర్ ప్రారంభంకాగా.. ఈసారి దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ కథను కేవలం కేరళకే పరిమితం చేయకుండా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న బలవంతపు మత మార్పిడిలు, లవ్ జిహాద్ వంటి అంశాలను ఇందులో చూపించారు. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన ఈ చిత్రంలో గతంలో నటించిన అదా శర్మ స్థానంలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రలు పోషించారు. మత మార్పిడికి నిరాకరించిన యువతులను చిత్రహింసలకు గురిచేయడం, బలవంతంగా గొడ్డు మాంసం తినిపించడం వంటి కఠినమైన దృశ్యాలను మేకర్స్ ఈ ట్రైలర్‌లో పొందుపరిచారు. అయితే ఈ ట్రైలర్‌పై కేరళ నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బలవంతంగా గొడ్డు మాంసం తినిపించే సన్నివేశంపై వారు మండిపడుతున్నారు. కేరళలో బీఫ్‌ను అందరూ ఇష్టంగా తింటారని, ఎవరికీ బలవంతంగా తినిపించాల్సిన అవసరం లేదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమా సమాజంలోని చేదు నిజాలను ధైర్యంగా చూపిస్తోందని మరికొందరు సమర్థిస్తున్నారు.





# చాలాకాలం రుచి, వాసన శక్తిని కోల్పోయా

## తన అనారోగ్యంపై మమ్ముట్టి తొలిసారి వివరణ

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి తన అనారోగ్యంపై వస్తున్న వార్తలపై తొలిసారి స్పందించాడు. గత ఏడాది జూన్ సమయంలో ఆయన అనారోగ్యానికి గురై దాదాపు నాలుగు నెలల పాటు సినిమాలకు విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. తాను చాలా కాలం పాటు రుచి, వాసన చూసే శక్తిని కోల్పోయానని, ఇప్పుడి ప్పుడే నెమ్మదిగా ఆ ఇంద్రియ జ్ఞానాన్ని తిరిగి పొందుతున్నానని తెలిపారు. కంటి చూపు, వినికిడితో పాటు శ్వాస తీసుకునేటప్పుడు వాసనను గుర్తించగలగడం కూడా ఒక గొప్ప వరమని, అటువంటి సామర్థ్యాలను కోల్పోయినప్పుడే వాటి విలువ అర్థమవుతుందని ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. ముఖ్యంగా వినికిడి శక్తి లేని వారి బాధ వర్ణనాతీతమని, మనం ఇతరుల గొంతును వినగలుగుతున్నాం కాబట్టే వారిని మెల్లగా మాట్లాడమని అడగగలమని, కానీ ఆ సామర్థ్యం లేని వారికి శబ్దాల మధ్య తేడా తెలియదని పేర్కొన్నారు. ప్రస్తుతం మమ్ముట్టి పూర్తి ఆరోగ్యంతో తిరిగి షూటింగ్‌లలో బిజీ అయ్యారు. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బ్జడెట్ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమా కోసం మమ్ముట్టి ఇటీవలే డబ్బింగ్ పనులను కూడా పూర్తి చేశారు. ఈ సినిమా మలయాళ చిత్ర పరిశ్రమలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలవనుంది. ఎందుకంటే సుమారు 18 ఏళ్ల తర్వాత మమ్ముట్టి, మోహన్ లాల్ కలిసి పూర్తిస్థాయి పాత్రల్లో స్క్రీన్‌ను పంచుకుంటున్నారు. వీరిద్దరితో పాటు విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్ విలన్‌గా నటిస్తుండటం విశేషం. నయనతార, కుంచాకో బోబన్ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తన భార్య సురేఖ పుట్టినరోజు సందర్భంగా హృదయాన్ని హత్తుకునేలా ఓ ఎమోషనల్ మెసేజ్ ను షేర్ చేసుకున్నారు. '1980 ఫిబ్రవరి 20న మేము వివాహం చేసుకున్న రోజు నుండి, మీరు నాకు గొప్ప బలం. ఈరోజు మీ పుట్టినరోజు మరియు మా వివాహ వార్షికోత్సవాన్ని ముందుగానే జరుపుకుంటున్నప్పుడు, నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. మీరు మా కుటుంబానికి కేంద్రకం, మా అందరినీ ప్రేమతో బంధించే వ్యక్తి. మీరు నా కుటుంబ సభ్యులను మీ స్వంతంగా ఆలింగనం చేసుకున్నారు, ప్రతి క్షణంలో వారికి అండగా నిలిచారు మరియు నా తల్లిదండ్రులు మిమ్మల్ని సమాన ఆప్యాయతతో ఆలింగనం చేసుకున్నట్లే వారికి నిజమైన కుమార్తె అయ్యారు. ఎవరైనా నా విజయ రహస్యం ఏమిటని అడిగితే, అది నా ప్రతిభ లేదా కృషి కాదు, "ఇది నువ్వే". మీరు ప్రతి బాధ్యతను ప్రశాంతంగా నిర్వర్తించారు కాబట్టి, నేను పూర్తిగా నా వృత్తిపై దృష్టి పెట్టగలను. ప్రతి సంక్షోభంలో, ప్రతి వేడుకలో, మమ్మల్ని కలిపి ఉంచేది నువ్వే. మీరు నా భార్య మాత్రమే కాదు, మీరు నా బలం, నా మద్దతు వ్యవస్థ, నా శాంతి. ఈరోజు మీ పుట్టినరోజున, మరియు మేము మా వివాహ వార్షికోత్సవాన్ని సమీపిస్తున్నప్పుడు, నేను నా హృదయం నుండి చెప్పాలనుకుంటున్నాను ' నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఈ దాంపత్య బంధంపై మెగాస్టార్ చేసిన ఈ హృదయపూర్వక ప్రకటన, వారి అనుబంధం ఎంత బలమైనదో తెలియజేస్తోంది.




# అక్కినేని ప్రేమాభిషేకానికి 45 ఏళ్లు పూర్తి

అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే ఐకానిక్ సినిమా 'ప్రేమాభిషేకం'. అప్పట్లో ఇది సిల్వర్ జూబ్లీ జరుపుకుంది. దేవదాసు తరవాత మళ్లీ అంతటి సినిమాగా ప్రాచుర్యం పొందింది. ఈచిత్రం విడుదలై 45 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ప్రత్యేక వీడియోను పంచుకుంది. లక్షల మంది హృదయాల్లో ఏఎన్నార్ ఎప్పటికీ జీవించే ఉంటారని పేర్కొంది.



# సిద్దార్థ్ మల్హోత్ర తండ్రి సునీల్ మల్హోత్ర కన్నుమూత

బాలీవుడ్ నటుడు సిద్దార్థ్ మల్హోత్ర తండ్రి సునీల్ మల్హోత్ర కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఫిబ్రవరి 14న ఆయన మరణించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. తండ్రిని తలచుకుంటూ సిద్దార్థ్ ఎమోషనల్ పోస్ట్ పెట్టడంతో ఈ విషయం ఖరారైంది. నిజాయతీ, విలువలతో జీవించారు. క్రమశిక్షణకు మారుపేరు. కాలం ఆయనకు ఎన్నో పరీక్షలు పెట్టినప్పటికీ అన్నిటినీ తట్టుకొని నిలబడ్డారు. ధైర్యంగా అనారోగ్యాన్ని ఎదుర్కొన్నారు. స్ట్రోక్ ఆయనను వీల్‌ఛైర్‌కు పరిమితం చేసినప్పటికీ భయపడలేదు. చివరకు నిద్రలోనే తుదిశ్వాస విడిచారు' అని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. తాను ఈ స్థానంలో ఉండడానికే కారణం తన తండ్రే అని సిద్దార్థ్ గుర్తుచేసుకున్నారు. ఎప్పటికీ ఆయన జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయన్నారు.

# సత్యదేవ్ కొత్త సినిమా షురూ.. క్లాప్ కొట్టిన అనిల్ రావిపూడి.!




యువ నటుడు సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న 15వ చిత్రం బుధవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో వైభవంగా ప్రారంభమైంది. లక్ష్మీనారాయణ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని త్రిషూల్ విజినరీ స్టూడియోస్ పతాకంపై నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సత్యదేవ్‌కు జోడీగా 'జాతిరత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా నటిస్తుండగా, ప్రముఖ గాయకుడు రామ్ మిర్యాల ఈ సినిమాతో పూర్తిస్థాయి సంగీత దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకకు సినీ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, నిర్మాత వంశీ నందిపాటి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్నేహం నేపథ్యంలో సాగే పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం 'రావుబహదూర్', 'గరుడ చాప్టర్-1' వంటి వైవిధ్యమైన సినిమాలతో బిజీగా ఉన్న సత్యదేవ్, ఈ కొత్త ప్రాజెక్టుతో మరో ఆసక్తికరమైన జోనర్‌లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.

# లోక చాప్టర్ 2పై కళ్యాణి ప్రియదర్శన్ క్రేజీ న్యూస్

డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించిన మలయాళ ప్రాజెక్టు 'లోక చాప్టర్ 1 చంద్ర' . కళ్యాణి ప్రియదర్శన్ ), నస్లేన్ హీరోహీరోయిన్లుగా నటించారు. 2025 ఆగస్టు 28న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. లోక 5 పార్టుల సిరీస్‌గా రాబోతుందని ప్రమోషనల్ ఈవెంట్స్‌లో డొమినిక్ అరుణ్ టీం ఇప్పటికే ఓ వార్తను షేర్ చేసిందని



తెలిసిందే. కాగా ఇటీవలే సీక్వెల్ లోక చాప్టర్ 2ను కూడా ప్రకటించేశారు. క్రేజీ సీక్వెల్‌పై ఆసక్తికర వార్తను షేర్ చేసింది కళ్యాణి ప్రియదర్శన్. 'ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ నడుస్తుంది. 2026 సెప్టెంబర్ నుంచి షూటింగ్ మొదలవుతుందని భావిస్తున్నా. అవును నేను కూడా సీక్వెల్‌లో భాగం అవుతున్నా. సినిమా కోసం వెయిట్ చేయండి..'అంటూ చెప్పుకొచ్చింది. కళ్యాణి ప్రియదర్శన్ కామెంట్స్‌తో లోక చాప్టర్ 2పై అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. సీక్వెల్‌కు జేక్స్ బిజోయ్ సంగీతం అందించనున్నాడు. సెకండ్ పార్ట్‌లో టోవినో థామస్ హీరోగా నటించనుండగా.. డొమినక్ అరుణ్ డైరెక్ట్ చేయబోతున్నాడు. చాప్టర్ 1 బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన విషయం తెలిసిందే. మరి రెండో పార్ట్ ఎలాంటి వసూళ్లు రాబడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

**- రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ బృందాలు**



**హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి18( వెలుతురు):**
తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు ఉదయం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ బాంబు కాల్ రావడంతో.. న్యాయవాదులు, కక్షిదారులను కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు బయటకు పంపేశారు. అలాగే ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహ ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు సైతం ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులోని సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే మళ్లీ అలాగే బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాంతో కోర్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.

# ఇద్దరు మావోల లొంగుబాటు

**- పునరావాసం కల్పిస్తామన్న అల్లూరి జిల్లా ఎస్పీ**

**పాడేరు, ఫిబ్రవరి18( వెలుతురు):**
ఛత్తీస్‌గఢ్‌లోని మాడేరియా డివిజన్ కమిటీకి చెందిన ఇద్దరు మావోయిస్టులు ఆంధ్ర పోలీసుల ఎదుట లొంగిపోయారు. బుధవారం అల్లూరి జిల్లా ఎస్పీ అమితి బర్దార్ ఎదుట వీరు స్వచ్ఛందంగా లొంగిపోయారు. అనంతరం జిల్లా ఎస్పీ బర్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ, పునరావాస పథకాలను పూర్తిగా వినియోగించుకుని గౌరవప్రదమైన, శాంతియుత జీవితం గడపాలని లొంగిపోయిన మావోయిస్టులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ ప్రాయోజిత శిక్షణ కార్యక్రమాల ద్వారా నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని వారికి సూచించారు. అలాగే ఇతర మావోయిస్టులు సైతం సమీప పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛందంగా లొంగిపోవాలన్నారు. అలా కాకుంటే కుటుంబ సభ్యుల ద్వారా.. నేరుగా సీనియర్ పోలీస్ అధికారులను సంప్రదించాలని మావోయిస్టులకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఇద్దరు మావోయిస్టుల్లో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారని తెలిపారు. కడితే హిడెం అలియాస్ అంజు అలియాస్ కరుణ- డివిజనల్ ఏరియా కమిటీ మెంటర్ , బద్చే భీమా అలియాస్ మనీష్ ఏరియా కమిటీ మెంటర్ గా పని చేశారని ఎస్పీ వివరించారు. వీరిద్దరు పలు నేరాలలో నిందితులను పోలీసులు ఈ సందర్భంగా చెప్పారు. మరో వైపు తాము లొంగిపోవడానికి గల కారణాలను ఈ ఇద్దరు మావోయిస్టులు వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల ఆపరేషన్లు తీవ్రతరం చేశారని చెప్పారు. కొత్త పోలీసు శిబిరాల ఏర్పాటు చేయడం వల్ల మావోయిస్టుల కదలికలు పరిమితం అయ్యాయని వివరించారు. నేపథ్యంలో ప్రాణ భయం ఏర్పడిందని వివరించారు. మావోయిస్టుల పట్ల ప్రజల మద్దతు తగ్గిపోవడం కూడా ఒక కారణమన్నారు. అలాగే సిద్ధాంతాలపై విశ్వాసం కోల్పోయినట్లు చెప్పారు. నిరంతర లొంగుబాట్ల కారణంగా పార్టీ సిద్ధాంతాలపై నిరాశ పెరిగిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో పలువురు సీనియర్ మావోయిస్టు నేతలు మరణించడంతో తమ కార్యకలాపాల తీవ్రంగా బలహీనపడ్డాయని చెప్పారు. ప్రభుత్వ పునరావాస విధానాలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ఆకర్షణీయమైన లొంగుబాటు ప్రయోజనాలు – ఆర్థిక సహాయం, భూమి, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కలగడంతో తీవ్రవాదాన్ని విడిచి జన జీవన స్రవంతిలోకి తిరిగి వచ్చామన్నారు.

# క్యాతనపల్లిలో కొనసాగిన బంద్

**- బాల్క సుమన్ ఇంటి వద్ద పోలీసుల హంగామా**

**మంచిర్యాల, ఫిబ్రవరి18( వెలుతురు):**
క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో ఆడబిడ్డలపై మీద కాంగ్రెస్ దౌర్జన్యం చేయడాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్, సీపీఐ ఆధ్వర్యంలో బంద్ కొనసాగుతోంది. మున్సిపాలిటీలోని వ్యాపారులు, వివిధ సంఘాలు, ప్రజలు ప్రజా తీర్పుకు మద్దతు తెలిపి బంద్‌లో పాల్గొన్నారు. బంద్ సందర్భంగా మున్సిపాలిటీలో భారీగా పోలీసులు మోహరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యను హౌస్ అరెస్టు చేశారు. ఇక నిన్న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పోలీసు సిబ్బందిపై దాడి చేశారని బాల్క సుమన్‌పై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో బాల్క సుమన్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ఆయన ఇంటి ముందు చేరుకున్నారు. ఈ విషయం తెలిసి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు అక్కడకు చేరుకున్నాయి. దీంతో బాల్క సుమన్ ఇంటి ముందు ఉద్రిక్తత నెలకొంది

# తాగుబోతు భర్తను హత్య చేసిన భార్య

**- చున్నీతో ఉరి బిగించి హత్య**

**హైదరాబాద్, ఫిబ్రవరి18( వెలుతురు):**
హైదరాబాద్ పాతబస్తీలో దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను భార్య దారుణంగా హత్య చేసింది . పాతబస్తీ భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు మహమ్మద్ ఇషాక్‌గా పోలీసులు గుర్తించారు. అతడు ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇషాక్ మద్యానికి బానిసవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే గత రాత్రి కూడా ఇరువురి మధ్య వాగ్వివాదం చెలరేగినట్లు తెలుస్తోంది. దీతో, మద్యం సేవించి రోజూ గొడవపడుతున్న భర్తను నిద్రలో ఉండగానే చున్నీతో గొంతు బిగించి హత్య చేసింది భార్య నూర్జహాన్ బేగం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

# ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్

**- స్టే ఎత్తివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ**
**- కిడ్నాపైన కౌన్సిలర్ యాదగిరి హాజరు**
**- స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్న కోర్టు**




**హైదరాబాద్, ఫిబ్రవరి18( వెలుతురు):**
ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యింది. మున్సిపల్ ఎన్నికపై గతంలో ఉన్న స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఈసీ, కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ ఎన్నికపై రెండు రోజుల క్రితమే హైకోర్టు స్టే విధించగా.. దాన్ని ఎత్తివేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి మిస్సింగ్‌పై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరుగగా.. యాదగిరిని కోర్టు ముందు హాజరుపర్చారు ఇబ్రహీపట్నం పోలీసులు. అతడి స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డ్ చేసింది. బీఆర్ఎస్ నేతలు తనను బలవంతంగా చీరాలకు తీసుకెళ్లి రిసార్ట్‌లో బంధించారని, ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు దాదాపు 12 గంటల పాటు హైదరాబాద్ మొత్తం తిప్పి చీరాలకు తీసుకెళ్లారని యాదగిరి స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం పంచాయితీ తెలంగాణ హైకోర్టుకు చేరింది. కోర్టు ఆదేశాలతో ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని హైకోర్టులో హాజరుపరిచారు పోలీసులు. ఆకుల యాదగిరి కనిపించడం లేదని కుటుంబసభ్యులు.. హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. యాదగిరిని హైకోర్టు ముందు హాజరుపరచాలని రెండు రోజులు క్రితం న్యాయస్థానం ఆదేశించింది. బుధవారం కౌన్సిలర్ యాదగిరిని కోర్టులో హాజరుపర్చారు పోలీసులు. దీంతో హైకోర్టు ముందు యాదగిరి స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఫలితాలు వెల్లడైన తర్వాత 12 గంటలపాటు హైదరాబాద్‌లో తిప్పారని.. బలవంతంగా తనను చీరాల తీసుకెళ్లారని చెప్పారు యాదగిరి. రెండు రోజులపాటు చీరాలలోని రిసార్ట్‌లో ఉంచారని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులతో నిన్న కౌన్సిల్ మీటింగ్‌కు హాజరైనట్లు ఆకుల యాదగిరి.. కోర్టుకు తెలియజేశారు. అతని స్టేట్‌మెంట్ పూర్తి అయిన తర్వాత హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నికపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రోవైపు క్యాంపు పేరుతో తన భర్తను కిడ్నాప్ చేశారని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆకుల యాదగిరి భార్య వసంత ఫిర్యాదు చేశారు. దీంతో యాదగిరి మిస్సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీ 363 కింద కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు. ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అతని తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డిపై ఆకుల యాదగిరి భార్య అనుమానాలు వ్యక్తం చేశారు. స్టే ఎత్తివేయడంతో ఇక ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యింది.

# టిటిడి కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధం

**- గొడవలు చేయడం కాదు..ఆధారాలతో రండి**
**- వైసిపి సభ్యులకు హోంమంత్రి అనిత సవాల్**



**అమరావతి, ఫిబ్రవరి18( వెలుతురు):**
టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ అసెంబ్లీలో తాము చర్చకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. చర్చ కాకుండా రచ్చ చేయాలనుకుంటున్న వైసిపి సభ్యుల తీరుపై మండిపడ్డారు. చేసిన పాపాలు బయటపడకుండా చేస్తున్న రాద్ధాంతంగా అభివర్ణిం చారు. ప్రజాహితం గురించి ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని సవాల్ చేశారు. ఆధారాలతో రావాలని వైసీపీ సభ్యులకు ఛాలెంజ్ చేశారు. టీటీడీ కల్తీ నెయ్యి విషయంపై చర్చకు సిద్ధమని మంగళవారం సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద అనిత మాట్లాడారు. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ తమ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టులో అసలు అది నెయ్యి కాదని.. రసాయనాల మిశ్రమమని చెప్పిందని తెలిపారు. గతంలో కూడా పింక్ డైమండ్ గురించి వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని విమర్శించారు. అధికారుల విచారణలో పింక్ డైమండ్ అనేది లేదని తేలిందన్నారు. హెరిటేజ్ సంస్థ 34 సంవత్సరాలుగా ఉందని.. ఆ సంస్థ నుంచి దేవాలయాలకు నెయ్యి పంపిణీ చేయకూడదనే నిబంధనను తమ ప్రభుత్వం పెట్టిందని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు సంబంధం లేని విషయాలని సభకు తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తే కుదరదని... ఆధారాలు ఉంటే రండి చర్చకు సిద్ధమని హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్క లేదని మండిపడ్డారు. టీటీడీ నెయ్యికి సంబంధించి సేకరణ లేని సంస్థకు జగన్ హయాంలో కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని ఛాలెంజ్ చేశారు. ఎవరితోనైనా ఆడుకోండని.. కానీ వేంకటేశ్వరస్వామితో ఆటలాడొద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్‌లో రాసిన విషయాలని వైసీపీ సభ్యులు సభలో మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి పేపర్‌లో యాడ్‌ల కోసం రూ.600 కోట్ల ప్రభుత్వ ధనాన్నిదుర్వినియోగం చేశారని హోంమంత్రి అనిత ఆరోపించారు. వైసీపీ నేతల్లాగా తమకు దుర్బుద్ధి లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ సభ్యులే కల్తీ లడ్డూ మీద వాయిదా తీర్మానం, ఇందాపూర్ డెయిరీ పైన వాయిదా తీర్మానం ఇచ్చారని ప్రస్తావించారు. మదనపల్లి చిన్నారి ఘటన విషయంలో నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అతను చేసింది తప్పని.. అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# బహుళ ప్రయోజనాల సూక్ష్మ సేద్యం..

**- రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు**
**- అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, ఫిబ్రవరి18( వెలుతురు):**
సూక్ష్మ సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయడం, అధిక దిగుబడులు సాధించడం వంటి బహుళ ప్రయోజనాలు ఉంటాయని.. ఈ నేపథ్యంలో అన్నదాతలు ప్రభుత్వం అందిస్తున్న సూక్ష్మ సేద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. లెక్టర్ లక్ష్మీశ బుధవారం తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, అధికారులతో కలిసి ఎ.కొండూరు మండలం, రేపూడి గ్రామ పంట పొలాలను సందర్శించారు. సూక్ష్మ సేద్యం పథకం ద్వారా ప్రయోజనం పొందుతూ రైతు జి.విష్ణువర్ధన్‌రెడ్డి సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను, పరికరాలను పరిశీలించారు. పథకం ప్రయోజనాలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో సాగునీటి యాజమాన్యం చాలా ప్రధానమైనదని.. సాగునీటి వనరుల సద్వినియోగంలో బిందు సేద్యం, తుంపర సేద్యం చాలా కీలకమైనవన్నారు. 2025-26లో 2,200 హెక్టార్లకు రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలను అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకాన్ని విజయవంతంగా అమలుచేస్తున్నామన్నారు. ఈ లక్ష్యానికి మించి కూడా 3,500 హెక్టార్ల వరకు రైతులకు ప్రయోజనం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏడు కంపెనీల ద్వారా పరికరాలు అమర్చుతున్న వివరించారు. సాగునీరు, కరెంటు వినియోగంలో 50 శాతం పొదుపుతో పాటు ఉన్న నీటితో ఎక్కువ విస్తీర్ణానికి నీరు అందించడం సూక్ష్మ సేద్యంతో సాధ్యమవుతుందని.. భూసారానికి, భూ సమతుల్యతకు ఎలాంటి హానీ కలగకుండా సాగువ్యయంలో దాదాపు 40 శాతాన్ని ఈ విధానంతో ఆదా చేసుకోవచ్చున్నారు. మామిడి, జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, కొబ్బరి వంటి పంటలతో పాటు కూరగాయలు, పూల తోటలకు కూడా సూక్ష్మ సేద్యం బాగుంటుందన్నారు. సూక్ష్మ సేద్యం వల్ల ఎకరా మొక్కజొన్నకు దాదాపు ఏడు క్వింటాళ్ల మేర అదనపు దిగుబడి వస్తుందన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా మొక్కజొన్న సాగుకు ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాలు, ఏపీ ఎంఐపీ కార్యాలయం ద్వారా వివరాలు పొంది, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరం మేరకు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల స్థూల జోడింపు విలువ (జీవీఏ)లో వృద్ధికి సూక్ష్మ సేద్యం విధానాలు కూడా ఉపయోగపడతాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ వెంట ఏపీ ఎంఐపీ పీడీ పి.ఎం.సుభాని, ఉద్యానశాఖ అధికారి నరేంద్ర కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ రంగారావు, సూక్ష్మ సేద్య పథకం జిల్లా కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# పరిటాలలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్

**- సీబీజీ ప్లాంటును పరిశీలించిన కలెక్టర్ జి.లక్ష్మీశ**



**విజయవాడ, ఫిబ్రవరి18( వెలుతురు):**
కంచికచర్ల మండలం, పరిటాలలో ఏర్పాటుచేస్తున్న రిలయన్స్ న్యూ ఎనర్జీ - కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటును ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం సందర్శించారు. 30 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ప్లాంటును త్వరలో ముఖ్యమంత్రి ప్రారంభించే అవకాశమున్నందున ప్లాంటులో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజుకు 22 టన్నుల సీబీజీ ఉత్పత్తి లక్ష్యంగా ఎ÷-లాంటును సిద్ధం చేస్తున్నట్లు ఎ÷-లాంటు సిబ్బంది వివరించారు. స్థానిక వ్యవసాయ వ్యర్థాలు, మునిసిపల్ ఘన వ్యర్థాలు వంటి వాటిని ఉపయోగించి పర్యావరణ హిత ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు ఇలాంటి ఎ÷-లాంటులు దోహదం చేస్తాయన్నారు. ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కూడా చేయూతనిస్తాయన్నారు. కర్బన ఉద్గారాలకు కళ్లెం వేయడంతో పాటు రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీబీజీ ఎ÷-లాంట్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, సంస్థ డీజీఎం శ్రీకాంత్, మేనేజర్ శ్రీచరణ్, అసిస్టెంట్ మేనేజర్ చిట్టిబాబు ఉన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com